




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 1 సంచిక : 25 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | శనివారం 7 ఫిబ్రవరి 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 25 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : TIRUPATI | SAT 7 FEBRUARY 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## రుణ గ్రహీతలకు ఊరట.. కీలక వడ్డీ రేట్లు యథాతథం

- రెపో రేటును యథాతథంగా ఉంచిన ఆర్బీఐ
- 5.25 శాతంగా కొనసాగనున్న వడ్డీ రేటు
- ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్న ద్రవ్య పరపతి కమిటీ
- ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని వెల్లడి
- 'న్యూట్రల్' విధానానికే కట్టుబడిన రిజర్వ్ బ్యాంక్

మిగతా2లో

## ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ పరామర్శ యాత్రలపై సీఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్ ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టడం, బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం వంటి రాజకీయాలు తన దగ్గర చెల్లవని, ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో తనకు బాగా తెలుసని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం

మిగతా2లో

- బలప్రదర్శన కాదు.. అభివృద్ధి ముఖ్యమన్న చంద్రబాబు
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చి చూపిస్తామని వెల్లడి
- గత ప్రభుత్వంలో పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయిందని విమర్శ
- కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారు చేయించారని ఆరోపణ
- భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ

## టీం 11... కల్తీకి, హత్యలకు బ్రాండ్ అంబాసిడర్లు

- బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నారా లోకేశ్
- బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపు
- విశాఖ ఉక్కును లాభాల్లోకి తెచ్చింది కూటమి ప్రభుత్వమేనని స్పష్టీకరణ
- దేశ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని వెల్లడి




పెన్ పవర్ డెస్క్:'టీం 11' బృందం కల్తీ మద్యం, కల్తీ నెయ్యి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. దేవుడిని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచుకుని, ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో క్లీన్‌చిట్ వచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు అనే విషయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలి. నాయకులు ఎంత ఎదిగినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా చివరకు మన దేవాలయం లాంటి టీడీపీ ఆఫీసుకే వస్తారు. పార్టీని బలోపేతం చేసేందుకు మనం అహర్నిశలు కష్టపడాలి" అని చంద్రబాబు చెప్పిన మాటలను గుర్తుచేశారు.

### బూత్ స్థాయి నుంచే పార్టీ పునర్నిర్మాణం

"గ్రామస్థాయి నుంచి కాదు, బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే టీడీపీ బలంగా ఉంటుంది" అని లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల తర్వాత కొన్ని బూత్‌లలో వేవ్ ఉన్నా ఎందుకు గెలవలేకపోయామనే కారణాలను అన్వేషించాలన్నారు. తన అనుభవాన్ని వివరిస్తూ, "1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ జెండా ఎగరలేదు. 2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఓడిన చోటే గెలవాలని కార్యకర్తలతో కలిసి బూత్‌ల వారీగా సమీక్షించి, నాలుగేళ్లు తూచా తప్పకుండా పనిచేసి విజయం సాధించాం" అని తెలిపారు. సంస్థాగత నిర్మాణంపై నమ్మకంతోనే గెలిచానని, ఇప్పుడు అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

మిగతా2లో



## ఓడిపోయాక కోర్టుకొస్తారా?

### ప్రశాంత్ కిశోర్ పార్టీ పిటిషన్‌పై సుప్రీం అసహనం

- ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ
- 2025 బీహార్ ఎన్నికలను రద్దు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు నిరాకరణ
- ఎన్నికల వేళ మహిళలకు రూ.10,000 పంచడంపై పిటిషన్‌లో ఆరోపణలు
- ప్రజలు తిరస్కరించాక కోర్టుకు వస్తారా అంటూ ధర్మాసనం అసంతృప్తి
- పాట్నా హైకోర్టుకు వెళ్లాలని సూచన

మిగతా2లో



## జగన్ పరామర్శ యాత్రలో విషాదం..

### జోగి రమేశ్ ఇంటి సమీపంలో వైసీపీ నేత మృతి

- జగన్ పర్యటన నేపథ్యంలో జోగి రమేశ్ ఇంటికి వస్తున్న వైసీపీ నేత
- పల్స్ పడిపోయి కుప్పకూలిన వైసీపీ నేత రాంబాబు

పెన్ పవర్ డెస్క్: వైసీపీ అధినేత జగన్ ఇబ్రహీంపట్నం పర్యటన సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జోగి రమేశ్ ను పరామర్శించేందుకు ఆయన తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నంకు బయల్దేరారు. ఈ క్రమంలో జోగి రమేశ్ ఇంటి సమీపంలో వైసీపీ నేత మృతి చెందారు. జగన్ వస్తున్న నేపథ్యంలో జోగి రమేశ్ ఇంటికి వెళుతున్న చిల్లకల్లు గ్రామ వైసీపీ అధ్యక్షుడు డి.రాంబాబు పల్స్ పడిపోయి కుప్పకూలారు. వెంటనే ఆయనను సమీప ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు కాసేపటి క్రితం జోగి రమేశ్ ఇంటికి జగన్ చేరుకున్నారు. ఆయన ఇంటిని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగన్ పర్యటన సందర్భంగా ఓ కుర్రాడు కూడా మరణించినట్టు తెలుస్తోంది. బైక్ పై విన్యాసాలు చేస్తూ బార్ గేట్ ను ఢీకొనడంతో అతడు మృత్యువాతపడినట్టు సమాచారం. మృతిచెందిన కుర్రాడిని ఇబ్రహీంపట్నంకు చెందిన భార్గవ్ గా గుర్తించారు.

## ఇస్లామాబాద్ లో భారీ పేలుడు... 69 మంది మృతి



- మృతుల సంఖ్య 69కి చేరగా, 169 మందికి గాయాలు
- నగరంలో ఎమర్జెన్సీని ప్రకటించినట్లు పోలీసు అధికారి వెల్లడి
- గాయపడిన వారిని ఆసుపత్రికి తరలింపు
- ఇస్లామాబాద్‌లోని షియా మసీదులో భారీ పేలుడు
- శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో జరిగిన దాడి
- ఇది ఆత్మాహుతి దాడి అని అనుమానిస్తున్న అధికారులు

పెన్ పవర్ డెస్క్:ఆత్మాహుతి దాడి నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ విధించింది. ఇస్లామాబాద్‌లోని షియా మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో మృతుల సంఖ్య 69కి చేరగా, 169 మంది గాయపడ్డారు. నగరంలోని షెహ్జాద్ టౌన్ ప్రాంతంలో గల షియా

మిగతా2లో



## హిందూపురంలో కాల్పుల కలకలం..

### రౌడీషీటర్‌పై పోలీసుల ఫైరింగ్

- హిందూపురంలో రౌడీషీటర్‌పై పోలీసుల కాల్పులు
- సీఐ, కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసి పారిపోయేందుకు యత్నం
- రౌడీషీటర్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లిన బుల్లెట్
- నిందితుడిపై ఏపీ, కర్ణాటకలో 90 కేసులు నమోదు
- గతంలో గ్యాంగ్‌రేప్ కేసులోనూ నాగేంద్ర నిందితుడు

పెన్ పవర్ డెస్క్: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. చిలమత్తూరు మండలం ఎర్రకొండ అటవీ ప్రాంతంలో

మిగతా2లో

## కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన



- అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు రంగం సిద్ధం
- నేడు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ శంకుస్థాపన
- భారత్‌లో తొలి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు లక్ష్యం
- పరిశోధన, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయని అంచనా
- సామాన్యుడి జీవితంలో మార్పులు తీసుకురానున్న క్వాంటం టెక్నాలజీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక సరికొత్త సాంకేతిక అధ్యాయానికి నాంది పలుకుతూ, అమరావతి నేడు ఒక చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ప్రపంచ క్వాంటం టెక్నాలజీ రంగంలో రాష్ట్రాన్ని, దేశాన్ని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం పునాదిరాయి పడనుంది.

మిగతా2లో

## తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

- తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం చేయాల్సి ఉన్న పవన్
- ఎన్నికల ప్రచారం రద్దయినట్టు ప్రకటించిన జనసేన
- అనివార్య కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం రద్దయింది. ఇంతకు ముందు వెలువడిన ప్రకారం రేపు, ఎల్లుండి ఆయన ప్రచారం చేయాల్సి ఉంది. తాజాగా ఆయన ఎన్నికల ప్రచారం రద్దయినట్టు

మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# ఒంటరిగా బతకగలమా?

ఈ మధ్య కాలంలో తరచుగా యువత నోట వినిపిస్తున్న మాట కెరీర్ ముఖ్యం, పెళ్లి మా ఎదుగుదలకు ఆటంకం. మేము లక్షల జీతాలు తెచ్చుకుంటున్నాం. అవసరం అయితే ఇంట్లో పనులకు మనుషులను పెట్టుకుంటామనే ధోరణిలో వెళ్లిపోతున్నారు. అయితే, వీరు గ్రహించవలసిన విషయం ఏమిటంటే కొన్నాళ్ల వరకు ఈ జీవితం బాగానే ఉంటుంది. నలభై ఏళ్లు వచ్చాక అప్పుడు వీరిలో ఆలోచన మొదలవుతుంది. అప్పటి వరకు ఉన్న స్నేహితులు వారి వారి జీవితాల్లో స్థిరపడి పోవడం. బంధువులు దూరంగా ఉండటం, తల్లిదండ్రులు పెద్దవారై పోవడం.. ఈ నేపథ్యంలో వారి మనసుల్లో ఒక అలజడి. నిజానికి ఒంటరి జీవితం సుఖాన్ని, సంతోషాన్ని ఇస్తుందా? ముఖ్యంగా పెళ్లి చేసుకుని, పిల్లలు కలిగిన తర్వాత మనస్పర్థల కారణంగా విడిపోయిన జంటలు, ఒంటరిగా ఎన్నో రకాల కష్టాలు అనుభవిస్తున్నారు. ఆడవారు శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టాలు పడుతున్నారు.. ఒంటరి జీవితం అనుకున్నంత సౌఖ్యంగా ఉండదు. ఒంటరిగా జీవిస్తూ పిల్లల్ని పెంచడం మరీ కష్టం. విద్యా వికాసం, ఆర్థిక స్వాతంత్రం, స్వతంత్ర భావాలను పెంపొందిస్తున్నాయి. అది ఒంటరి జీవితాన్ని ప్రోత్సహిస్తోంది. కావాలనో, విడాకుల కారణంగానో జీవిత భాగస్వామిని కోల్పోవడం వల్లనో ఇటీవల కాలంలో ఒంటరిగా జీవించే వారి సంఖ్య పెరుగుతోంది. ఒంటరిగా బతకడం వల్ల జీవితాన్ని మన చిత్తం వచ్చినట్లు గడిపే అవకాశం ఉన్నప్పటికీ భవిష్యత్తు పట్ల భయం, పిల్లల ఆర్థిక సామాజిక భద్రతను గురించిన చింత వెంటాడుతూ ఉంటుంది. కొంతమందికి జీవిత భాగస్వామి అకాల మరణం మానసికంగా కుంగదీస్తుంది. ఇంటా బయటా బాధ్యతలు, ఆర్థిక సమస్యలు వెంటాడుతుంటాయి.. దానికి తోడు పిల్లల్ని పెంచడం తలకు మించిన భారం అవుతుంది. గతించిన వారి పేరిట జీవిత బీమా, అదనపు ఆదాయ వనరులు ఉంటే కొంత ఊరట కలుగుతుంది. విడాకులు తీసుకుని వేరుపడిన వారిలో కొందరికి పిల్లల్ని పెంచాల్సిన అదనపు బాధ్యత ఉంటుంది. మనోవర్తి వంటి వాటివల్ల ఆర్థికంగా కొంత నిలదొక్కుకో గలిగినా మనిషి సాయం లేకపోతే కష్టం. మీరు బయటకు వెళ్లినప్పుడు పిల్లలను కనిపెట్టుకుని ఉండేందుకు ఎక్కువ జీతం ఇవ్వాల్సి వచ్చినా మంచి పని మనిషిని పెట్టుకోవాలి. మీ లక్ష్యాలను పెద్ద మొత్తంలో నిధులు అవసరమయ్యే సమయాలను నిర్ధారించుకోండి. పిల్లల, విద్య, వివాహం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకోండి. కావాలని ఇష్టపడి ఒంటరిగా ఉంటూ కుటుంబాన్ని ఏర్పాటు చేసుకుంటే తప్ప ఒంటరి జీవితం నల్లేరుపై నడక కాదు.. జీవితం అంత సాఫీగా సాగదు. అయితే సానుకూల దృక్పథంతో, ముందుచూపుతో ప్రణాళిక రూపొందించుకుంటే ఒంటరి జీవితం గడపడం కొంత కష్టమైనా ఒడిదుడుకులు లేకుండా ముందుకు వెళ్లవచ్చు.. ఏది ఏమైనా ఒక మనిషికి ఇంకొక మనిషి తోడు అవసరం తప్పక కావాలి. అటువంటప్పుడు వివాహం చేసుకుని ఒక కుటుంబాన్ని కలిగి ఉంటే, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సమాజంలో గౌరవం, భద్రత కలిగి ఉంటారు. కుటుంబం వలన ఎంతో కొంత మానసిక ధైర్యం లభిస్తుంది. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి, పెద్దలతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటే మంచిది. ఒంటరి జీవితం కొన్నాళ్ల వరకు బాగానే ఉన్నా, తర్వాత్తర్వాత అభద్రతా భావం కలిగిస్తుంది. కాబట్టి జాగ్రత్త.

# కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

- మొదటి పేజి తరువాయి
ఈ కీలక కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ హాజరుకానున్నారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. శనివారం మధ్యాహ్నం 2:45 గంటలకు ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 3:00 గంటలకు శంకుస్థాపన ప్రదేశానికి చేరుకుంటారు. సాయంత్రం 6:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ ప్రాజెక్టుతో భారతదేశ క్వాంటం విప్లవానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహించేందుకు మార్గం సుగమం కానుంది.

**రాష్ట్ర భవిష్యత్‌కు మైలురాయి**

అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీ, రాష్ట్రానికే కాక దేశానికే ఒక మైలురాయిగా నిలవనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడంలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి వంటి దిగ్గజ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ వ్యాలీ కేవలం ఒక భవన సముదాయంగా కాకుండా, ఒక సంపూర్ణ సాంకేతిక పర్యావరణ వ్యవస్థగా అభివృద్ధి చెందనుంది. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్ వంటి అత్యాధునిక రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ఇది కేంద్రంగా మారుతుంది.

దీని ద్వారా ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, గ్లోబల్ టెక్నాలజీ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడం, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడం, లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం సాధ్యమవుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

**సామాన్యుడికి ప్రయోజనాలు**

క్వాంటం టెక్నాలజీ కేవలం శాస్త్రవేత్తలకే పరిమితం కాదని, దాని ఫలాలు సామాన్యుడి జీవితంలో గణనీయమైన మార్పులు తీసుకువస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ఉదాహరణకు, ఫార్మా రంగంలో పరిశోధనలు వేగవంతమై కొత్త ఔషధాలు త్వరగా అందుబాటులోకి వస్తాయి. వ్యాధుల నిర్ధారణ మరింత కచ్చితంగా మారుతుంది. వ్యవసాయ రంగంలో వాతావరణాన్ని, వర్షపాతాన్ని కచ్చితంగా అంచనా వేయడం ద్వారా రైతులు ప్రయోజనం పొందుతారు. అలాగే, బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల భద్రత మరింత పటిష్టమవుతుంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తిచేసి, డిసెంబర్ కల్లా క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐటీ విప్లవానికి సిలికాన్ వ్యాలీ ఎలా కేంద్రంగా నిలిచిందో, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్ల తయారీకి, పరిశోధనలకు అమరావతి గ్లోబల్ హబ్‌గా మారుతుందని అంచనా వేస్తున్నారు.

# టీం 11... కల్తీకి, హత్యలకు బ్రాండ్ అంబాసిడర్లు

- మొదటి పేజి తరువాయి
నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం

ఐదు జోన్లలో 4,772 బూత్‌లను బలోపేతం చేసేందుకు 903 మంది సీనియర్ నాయకులను నియమించినట్లు లోకేశ్ వెల్లడించారు. "ప్రతి నాయకుడు బూత్‌కు కనీసం ఒక రోజు కేటాయించి, అక్కడి పరిస్థితులను తెలుసుకుని, పార్టీ బలోపేతానికి నివేదిక ఇవ్వాలి. ఇకపై బూత్ పనితీరు ఆధారంగానే రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. కష్టపడి పనిచేసిన వారికే పార్టీలో పదవులు దక్కుతాయి," అని ఆయన స్పష్టం చేశారు. పసుపు జెండా కోసం ప్రాణాలు త్యాగం చేసిన అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ, తోట చంద్రయ్య వంటి కార్యకర్తలే తనకు స్ఫూర్తి అని అన్నారు.

**కూటమి ప్రభుత్వ ఘనతలను వివరించాలి**

"దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్‌ది. విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం. అమరావతి, పోలవరం పనులు వేగవంతం చేశాం. కర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం," అని లోకేశ్ తెలిపారు. రూ.4 వేల పింఛను, తల్లికి వందనం, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, 16 వేల టీచర్ పోస్టుల భర్తీ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

**కూటమిలో విడాకులు ఉండవు**

"రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. కనీసం 15 ఏళ్లు కలిసికట్టుగా ముందుకు వెళితేనే అభివృద్ధి సాధ్యమని పవనన్న చెప్పారు. మన కూటమిలో విడాకులు, మిస్ ఫైర్‌లు, క్రాస్ ఫైర్‌లు ఉండవు. ఏవైనా సమస్యలుంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. వైసీపీ మన మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది, అందరూ అప్రమత్తంగా ఉండాలి" అని లోకేశ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు

- మొదటి పేజి తరువాయి
రాజకీయం కోసం బలప్రదర్శనలు చేయడం సరికాదని, ఎన్నికల సమయంలో సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు.

కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి– మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.

గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు. గత పాలకులు పోలవరాన్ని గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు.

రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఓడిపోయాక కోర్టుకొస్తారా?

ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన 'జన్ సురాజ్' పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేసి, కొత్తగా పోలింగ్ నిర్వహించాలని కోరుతూ ఆ పార్టీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. పాట్నా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ, పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లుగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. జన్ సురాజ్ తరఫున సీనియర్ న్యాయవాది చందర్ ఉదయ్ సింగ్ వాదనలు వినిపించారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' కింద మహిళలకు రూ.10,000 చొప్పున పంపిణీ చేసిందని, ఇది ఓటర్లను ప్రలోభపెట్టడం, లంచం ఇవ్వడం కిందకే వస్తుందని ఆరోపించారు. తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న బీహార్‌లో ఇలాంటి పథకం ద్వారా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని పేర్కొన్నారు.

ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "మీకు ఎన్ని ఓట్లు వచ్చాయి? ప్రజలు తిరస్కరించిన తర్వాత ఉపశమనం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారా?" అని ఘాటుగా ప్రశ్నించింది. ఈ పథకంపై అభ్యంతరం ఉంటే సరైన సమయంలోనే సవాల్ చేయాల్సిందని అభిప్రాయపడింది. మొత్తం ఎన్నికల ప్రక్రియను రద్దు చేయాలని కోరడం సరికాదని వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా ఉచిత పథకాలపై దాఖలైన ఇతర పిటిషన్లపై విచారణను కొనసాగిస్తామని స్పష్టం చేసిన ధర్మాసనం, ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ వేసిన ఈ పిటిషన్‌ను మాత్రం విచారించలేమని తేల్చిచెప్పింది. పిటిషనర్ సదుద్దేశాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది పాట్నా హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి కోరగా, ధర్మాసనం అంగీకరించింది.

# వేలము ప్రకటన

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్ ) వారి కోర్టు, మచిలీపట్నం**

**ఇ.పి.నెం.17/2024, ఓ.యస్ .నెం. 191/2022**

**బిట్వీన్**

**బొందలపాటి రామకృష్ణారావు** — **డి.హెచ్.ఆర్.**

**ఎదిరి**

**బొందలపాటి రాజమ్మ మరియు ఇతరులు** — **జె.డి.ఆర్స్...**

పై నెంబరు అమలులో జె.డి. ఆర్స్ తాలూకు యీ నెంబరు డిక్రీ బాకీ క్రింద జప్తుకాబడిన దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని శ్రీ కోర్టువారు ది. 23-02-2026వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టువారిచే వేలం జరుపబడును. సదరు వేలంలో పాల్గొనదలచినవారు కోర్టువారి ఎదుట పై తేదీన ఉదయం గం.10.30 ని॥లకు హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.

<u>అయిటం నెం.1</u>- కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ డి॥ గూడూరు మండలం, మల్లవోలు గ్రామ పంచాయితీ ఏరియా, మల్లవోలు గ్రామ ఆర్.యస్. నెం. 916-1-ఎం-1 లో య.0-73 సెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు - బొందలపాటి లక్ష్మి గారి భూమి,
దక్షిణ - బొందలపాటి భానుచంద్ గారి భూమి,
పడమర - రావి కస్తూరిబాయి గారి భూమి,
ఉత్తర - బొందలపాటి భానుచంద్ గారి భూమి
యీ హద్దుల మధ్య య. 0-73 సెంట్లు లేదా 0.295 హెక్టార్లు మాగాణి భూమి మరియు

<u>అయిటం నెం. 2</u> - కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ డి॥ గూడూరు మండలం, మల్లవోలు గ్రామ పంచాయితీ ఏరియా, మల్లవోలు గ్రామ ఆర్.యస్. నెం. 916-1-ఎం-1 లో య. 0-47 సెంట్లు ఆర్.యస్. నెం. 916-1-ఎం లో య. 0-26 సెంట్లు వెరశి రెండు నెంబర్ల దాఖలా య. 0-73 సెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు - బొందలపాటి లక్ష్మి గారి భూమి
దక్షిణ - ముురుగునీటి కాలువ
పడమర - బొందలపాటి భానుచంద్ మరియు బొందలపాటి రాజమ్మ గార్ల భూమి.
ఉత్తర - బొందలపాటి భానుచంద్ గారి భూమి

యీ హద్దుల మధ్య య.0-73 సెంట్లు లేదా 0.295 హెక్టార్లు మాగాణి భూమి మరియు

<u>అయిటం నెం.3</u>- కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ డి॥ గూడూరు మండలం, మల్లవోలు గ్రామ ఏరియా, మల్లవోలు గ్రామ ఆర్.యస్. నెం. 916-1-ఎం లో య.0-73 సెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు - బొందలపాటి లక్ష్మి గారి భూమి,
పడమర - మురుగునీటి కాలువ,
ఉత్తరము - రావి కస్తూరిబాయి గారి భూమి.
దక్షిణ - బొందలపాటి రాజమ్మ గారి భూమి,
యీ హద్దుల మధ్య య. 0-73 సెంట్లు లేదా 0.295 హెక్టార్లు మాగాణి భూమి.
ఇ.సి. దాఖలా అన్యాక్రాంతములు ఏమియు లేవు.

మూడు అయిటములు కలపి డి.హెచ్.ఆర్. విలువ - రు. 20,00,000/-
అమీనా విలువ -0.42,00,000/-
ఎస్.ఆర్.ఓ. విలువ - రు. 41,49,500/-

వేలం వాయిదా తేదీ - 23-02-2026
ఫర్‌దర్ హియరింగ్- 02-03-2026
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

**ఎస్. శ్రీనివాస్,**
డి. హెచ్.ఆర్. తరపు న్యాయవాది,
రేపల్లె
సెల్. నెం: 9347076161

# రుణ గ్రహీతలకు ఊరట.. కీలక వడ్డీ రేట్లు యథాతథం

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. పాలసీ రెపో రేటును ప్రస్తుతమున్న 5.25 శాతం వద్దే కొనసాగించాలని ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో పాటు తమ 'న్యూట్రల్ మానిటరీ పాలసీ' వైఖరికే కట్టుబడి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. దేశ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. గత డిసెంబర్ సమావేశం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రతికూలతలు పెరిగినప్పటికీ, ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే, వృద్ధికి ఆటంకం కలగకుండా సమతౌల్యం పాటించడమే 'న్యూట్రల్' వైఖరి ఉద్దేశమని వివరించారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని, ఆర్బీఐ నిర్దేశించిన సహన పరిమితి కంటే తక్కువగా ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాలకు సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాలను వరుసగా 4 శాతం, 4.2 శాతానికి సవరించినట్లు తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయని, దేశీయ అంశాలే దీనికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. గత డిసెంబర్‌లో జరిగిన సమీక్షలో వృద్ధిని ప్రోత్సహించేందుకు ఆర్బీఐ రెపో రేటును 5.5 శాతం నుంచి 5.25 శాతానికి (25 బేసిస్ పాయింట్లు) తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆగస్టు, అక్టోబర్‌లలో రేట్లను స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం రేట్లలో మార్పు లేనందున గృహ, వాహన రుణాలతో సహా ఇతర రుణాలపై వడ్డీ రేట్లు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదు.

# తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

- మొదటి పేజి తరువాయి
జనసేన ప్రకటించింది. ఏపీలో రాజకీయ పరిణామాలు, పవన్ వ్యక్తిగత కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం. మరోవైపు, మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన నేతలతో ఈ ఉదయం పవన్ భేటీ అయిన సంగతి తెలిసిందే. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల గురించి వారితో పవన్ చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్, రాజలింగం, సాగర్ (ఆర్కే నాయుడు) తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఇస్లామాబాద్ లో భారీ పేలుడు... 69 మంది మృతి

- మొదటి పేజి తరువాయి
మసీదు ప్రధాన ద్వారం వద్ద పేలుడు సంభవించింది. ఈ పేలుడు వల్ల సమీపంలోని భవనాలు, కిటికీలు కూడా పగిలిపోయాయి. పేలుడు అనంతరం నగరంలో నగరవ్యాప్తంగా ఎమర్జెన్సీని ప్రకటించినట్లు ఇస్లామాబాద్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో భద్రతా సిబ్బంది విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ దుర్ఘటనలో గాయపడిన వారిని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పాలీక్లినిక్ ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఖండించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని, పలువురు మృతి చెందారని అన్నారు. ఆత్మాహుతి దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

# హిందూపురంలో కాల్పుల కలకలం..

- మొదటి పేజి తరువాయి
నాగేంద్ర అనే రౌడీషీటర్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బుల్లెట్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లి, అతను తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, నాగేంద్రను అరెస్ట్ చేసేందుకు సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవి వెళ్లగా, అతను వారిపై కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి తప్పించుకుని పారిపోతుండటంతో, ఆత్మరక్షణ కోసం సీఐ ఆంజనేయులు అతనిపై కాల్పులు జరిపినట్లు సమాచారం. నిందితుడు నాగేంద్రపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కలిపి సుమారు 90 కేసులు ఉన్నాయి. గతంలో హిందూపురంలో అత్తాకోడళ్లపై జరిగిన గ్యాంగ్‌రేప్ కేసులో కూడా ఇతను ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. చాలాకాలంగా తప్పించుకు తిరుగుతున్న నాగేంద్ర కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది. బుల్లెట్ గాయంతో పట్టుబడిన నాగేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏపీఎంఎఫ్ డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పలమనేరు,పెన్ పవర్,ఫిబ్రవరి 06.పలమనేరు శాసన సభ్యులు అమరనాథరెడ్డి చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) డైరీ ఆవిష్కరణ శుక్రవారం జరిగింది.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తరపున నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించడంపై సంతోషం వ్యక్తం చేశారు.అలాగే పాత్రికేయ మిత్రులకు ఈసందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీఎంఎఫ్ నాయకులు,జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఏరుగుత్తి బాలాజీ,సుబ్రహ్మణ్యం మరియు రెడ్డిప్రసాద్ తదితరులు ఉన్నారు.



పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

# నా శక్తికి మించి నెల్లూరు రూరల్‌ను అభివృద్ధి చేస్తా

## -ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి





నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 6.
ఒకటికి మూడు సార్లు ఒకే నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలిపించిన నెల్లూరు రూరల్ ప్రజలకు ఎంత చేసినా తక్కువే నేటి ఉదయం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో 1 కోటి 20 లక్షల రూపాయలతో 3 ఫేజ్ 24 గంటల చంద్రన్న విద్యుత్ వెలుగులు కార్యక్రమాన్ని ప్రారంభించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వాడవాడలా అభివృద్ధి పనులు ఒక జాతరను తలపిస్తున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. 370 కోట్ల రూపాయలతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 1వ డివిజన్ లో అభివృద్ధి పనులకు 5 కోట్ల 72 లక్షలు నిధులు కేటాయించాము. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్ ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. పై కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కుడుముల చిరంజీవి, కో క్లస్టర్ ఇంచార్జ్ తంబి శ్రీనివాసులు, 1వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు ఎమ్.డి. జావీద్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఓట్టూరు సురేంద్ర యాదవ్, కోడూరుపాడు పి.ఎ.సి.ఎస్. సొసైటీ అధ్యక్షుడు గంగి జయరామి రెడ్డి, పెద్దచెరుకూరు పి.ఎ.సి.ఎస్. సొసైటీ మెంబర్ సుబ్బరామయ్య, టిడిపి నాయకులు జానకి రామయ్య, యనమల శేషు యాదవ్, యనమల హరిబాబు యాదవ్ కరిముల్లా వేణు యాదవ్ ఎర్ర ధనంజయ తంబి వెంకట రమణయ్య కన్నా బ్రహ్మయ్య తంబి శ్రీనివాసులు జానా జనార్ధన్ పెంచల నరసింహ కారు దుంప శ్రీనివాసులు చక్రవర్ధన్ వనపల్లి రాజు శివకుమార్ దొంతు విజయ్ సురేష్ కిరణ్ సుధీర్ , ఏసుప్రభు ప్రసాద్ కాకర్ల వెంకటేశ్వర్లు రమణయ్య షేక్ మస్తూర్ బాబు శేషు సుబ్బారావు షరీఫ్ సాహుల్ తిరుమల మనీ కాజా రాజు ముజీర్ జమీర్ పురుషోత్తం సుబ్రహ్మణ్యం గోపి లక్ష్మయ్య జయరాం రమణి గౌరీ తదితరులు పాల్గొన్నారు



# ఎస్.సి కాలనీకు సంబంధించిన స్మశాన వాటిక ముళ్ల చెట్లు తొలగింపు




కొడవలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 6.
ఎస్.సి కాలనీ కు సంబందించిన స్మశాన వాటిక ముళ్ల చెట్లతో నిండి కర్మకాండకు ఇబ్బంది ఉండి నందున్న కొడవలూరు ఎస్.సి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళగా వారు వెంటనే స్పందించి జెసిపి ను పంపించి మొత్తం ముళ్ల చెట్లను జంగిల్ క్లియర్స్ చేయంచారు. గ్రామ ప్రజలు ఎం.పీ వేమిరెడ్డి ప్రభాకర్ కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొడవలూరు గ్రామ ఎస్.సి కాలనీ ప్రజలు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గుండాలంపాలెం సొసైటీ డైరెక్టర్ పి.శ్రీనివాసులు బూత్ కన్వీనర్ దుంపల బాబు, నీటి సంఘం అధ్యక్షులు నక్క రమణయ్య,టీడీపీ సోషల్ మీడియా కోవూరు వెంకీ, వార్డ్ మెంబర్ నక్క రాజేంద్ర, ఆర్.బాబు డి .దినేష్ కె.మురళి, జి సుబ్బు, గంగపట్నం శ్రీనివాసులు ఊయ్యాల నారాయణ, కె ప్రవీణ్ తదితరులు పాల్గున్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### - రైతులకు రాజముద్రతో పాసుపుస్తకాలు పంపిణీ -కొత్తపల్లి, పరిసర ప్రాంత చెరువులకు నీరందిస్తాం

### - కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి వెల్లడి - ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే






కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 6
రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి రైతులకు పాసు పుస్తకాలను అందజేశారు. ప్రజా దర్బార్ నిర్వహించి, ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త తరహా పాసు పుస్తకాల్లో క్యూ ఆర్ కోడ్, భూమి విస్తీర్ణం, లాంగిట్యూడ్‌లాటిట్యూడ్ వివరాలు, ఎనిమిది దిక్కుల హద్దులు పొందుపరచడం ద్వారా భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం ఒకే పత్రంలో లభిస్తుందని తెలిపారు. ఇకపై బ్యాంకు లోన్ కోసం అధికారులు రైతుల పొలాలకు రావాల్సిన అవసరం లేకుండా, క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తేనే భూమి వివరాలన్నీ స్పష్టంగా కనిపిస్తాయని చెప్పారు. దీని వల్ల రుణాల ప్రక్రియ వేగవంతమై, రైతులకు సమయంఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో పాసు పుస్తకాలపై వ్యక్తిగత ఫోటోలు ముద్రించడాన్ని ఆయన విమర్శించారు. ప్రజల ఆస్తులపై రాజకీయ ముద్రలు ఉండకూడదని స్పష్టం చేశారు. రాష్ట్ర చిహ్నంతో రాజముద్ర కలిగిన కొత్త పాసు పుస్తకాలను ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 120 సంవత్సరాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా భూములకు రీసర్వే చేపట్టి, పాత రికార్డుల గందరగోళాన్ని తొలగిస్తూ కొత్త హద్దులను ఖరారు చేశామని ఎమ్మెల్యే వివరించారు. రైతులు తమ పాసు పుస్తకాల్లో ఏవైనా పొరపాట్లు గమనిస్తే వెంటనే తహసీల్దార్ కార్యాలయం లేదా సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుని సవరణ చేయించుకోవాలని సూచించారు. కొత్త పఇతర రాష్ట్రాల వారు లేదా భాష తెలియని బ్యాంకు అధికారులు సైతం భూమి వివరాలు సులభంగా అర్థం చేసుకునే వీలుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీ కృష్ణ, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, రెవెన్యూ అధికారులు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అభిషేకాలు, భజనలు,అన్నదానండ కొండమిట్టలో వినాయక ఉత్సవాలకు విశేష స్పందన.





శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి ,06 :
శ్రీకాళహస్తి కొండమిట్టలో సుందరం ట్రాన్స్పోర్ట్ మేనేజర్ సుబ్రమణ్యం నివాసం ఎదుట ఏర్పాటు చేసిన జలవినాయక స్వామి వారి 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఉదయం 9 గంటల నుంచే ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, మధ్యాహ్నం 12 గంటలకు సుమారు 500 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి భక్తులను ఆదరించారు.సాయంత్రం 6:30 గంటలకు షిరిడీ సాయిబాబా భజన బృందం ఆధ్వర్యంలో భక్తిమయ వాతావరణంలో భజన కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు సురేష్, గుమ్మల్ల రాజేశ్వరరావు, కుప్పారావు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# రుద్రకోటలో రైల్వే ఉద్యోగి దారుణ హత్య





కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 6
కావలి రూరల్ మండలం రుద్రకోట ఎస్సీ కాలనీలో రైల్వే ఉద్యోగి దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం జరిగింది. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రకోట గ్రామానికి చెందిన ఆరే నాగరాజు (45) రైల్వే గేట్ మెన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి గత 20 సంవత్సరాల క్రితం చిన్నగంజాం కు చెందిన మాధవి తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వివాహం అయిన 8 సంవత్సరాలకు భార్యాభర్తలకు గొడవలు రావడంతో నాగరాజు భార్య మాధవి తన ముగ్గురు పిల్లలను తీసుకుని చినగంజాంకు వెళ్ళిపోయింది. గత 12 సంవత్సరాల నుండి నాగరాజు రైల్వే ఉద్యోగం చేసుకుంటూ రుద్రకోటలో నివాసం ఉంటున్నాడు. నాగరాజు బాబాయ్ మల్లికార్జున భార్య శేషమ్మ ప్రతిరోజు నాగరాజు ఇంటిని శుభ్రపరుస్తుంది. రోజులాగే శేషమ్మ ఇల్లు శుభ్రపరిచేందుకు వెళ్లగా నాగరాజు మృతి చెంది ఉన్నాడు. నాగరాజుకు రక్త గాయాలు కూడా అయి ఉన్నాయి. దీంతో శేషమ్మ విషయాన్ని బంధువులకు తెలుపుగా వారు పోలీసులకు సమాచారం అందించారు. కావలి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు డాగ్ స్క్వాడ్ని పిలిపించి హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు మాట్లాడుతూ నాగరాజుకు గత కొంతకాలంగా అతను ఉంటున్న ఇంటి విషయమై భార్య కుమారులతో గొడవలు జరుగుతున్నాయని తెలిసిందన్నారు. ఆకోణంతోపాటు హత్యకు గల ఇతర కోణాల్లో కూడా విచారణ చేపట్టి కేసును త్వరలో చేదిస్తామన్నారు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు

# సిపిఎం నేత అప్పలరాజు విడుదలపై హర్షం.

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంగారపు మురళి.

తిరుపతి,పెన్ పవర్,ఫిబ్రవరి 6.
జైల్లో ఉన్న సిపిఎం నేత అప్పలరాజు కు హైకోర్టు బెయిల్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి.అనకాపల్లి సిపిఎం నేత అప్పలరాజు పై అక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం పీడి చట్టాన్ని ప్రయోగించి జైలు పాలు చేయడంపై తీవ్ర ఆందోళన చేసిన కార్మిక సంఘాలు.చట్టబద్ధమైన, శాంతియుతమైన, ప్రజాస్వామ్య ప్రక్రియతో ఉద్యమాలు చేస్తున్న అప్పలరాజు పై కార్పొరేట్ కంపెనీలకు దాసోహం అన్న చంద్రబాబు ప్రభుత్వం అన్యాయంగా పీడీ యాక్ట్ ప్రయోగించిందని... 42 రోజులపాటు జైల్లో నిర్బంధించిందని, ఈ నిర్బంధాన్ని జయించి తిరిగి జనజీవనంలోకి వస్తున్న అప్పలరాజు మరిన్ని ఉద్యమాలు చేపట్టి కొనసాగాలన్నారు.అయన పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు అమానుషమైందని ఉద్యమాల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తన వైఖరి మార్చుకోవాలన్నారు



# 8వ వార్డు వైఎస్సార్సీపీ సమావేశం.



శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి ,06 :
శ్రీకాళహస్తి టౌన్ 8వ వార్డుకు సంబంధించిన వైఎస్సార్సీపీ నాయకులతో పార్టీ పరిశీలకులు సమావేశమై, వార్డు కమిటీతో పాటు అనుబంధ కమిటీల సభ్యుల నియామకంపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో స్థానిక నాయకులు చంద్రరాజు, ఆరిఫ్, నాగమ్మ, అమర్నాథ్, వంశీకృష్ణ పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. పార్టీ పరిశీలకులు పఠాన్ ఫరీద్, పెరుమాల్ చౌదరి కమిటీల నిర్మాణంపై మార్గదర్శకాలు సూచించారు.అలాగే పార్టీ నాయకులు మహబూబ్ బాషా, లీలా కుమార్ ఈ సమావేశానికి హాజరై, పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## నాకు ప్రాణ రక్షణ కల్పించాలి...అలిమిలి సురేష్

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,6:



గూడూరు మండలం చెమిర్తి గ్రామానికి చెందిన అలిమిలి సురేష్ అలియాస్ దశయ్య తన స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి దౌర్జన్యంగా దాడి చేస్తున్నారని ఆరోపించారు. గత నెలలో స్థలంలో పునాది గుంట తవ్వుతుండగా ప్రశ్నించినందుకు కర్ర, కత్తితో చంపుతామని బెదిరించారని తెలిపారు. ఈ ఘటనపై గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని ప్రాణ రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ, కలెక్టర్‌లను కోరారు.

## ఘనంగా శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ద్వితీయ వార్షికోత్సవం

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,6:



గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు వైభవోపేతంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వైవిధ్యభరిత సాంస్కృతిక కార్యక్రమాలు, సాహసోపేతమైన మార్షల్ ఆర్ట్స్ స్కిట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ ఈ అభ్యాస్ అకాడమీ చైర్మన్ డాక్టర్ ఫణి పవన్ శాస్త్రి మాట్లాడుతూ, నాలెడ్జ్, వాల్యూస్, లీడర్షిప్ అనే భావనలతో గాయత్రి స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు ప్రామాణికమైన కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంలో సఫలమవుతోందని అభినందించారు. విద్యార్థులు పరిశోధనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా ఆలోచిస్తూ ముందుకు సాగి అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, పలు పాఠశాలల కరస్పాండెంట్లు పవన్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, చంద్రమోహన్, వంశి, బాలకృష్ణం రాజు, రాఘవరెడ్డి, నవకోటి నాయుడు, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి మనోజ్ కుమార్, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## గొప్ప సిద్ధాంతాలతో భారత గౌరవాన్ని కాపాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ...

### -డా. సయ్యద్ తాజుద్దీన్





గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,6:

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ నాయకత్వంలో గురువారం విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో గూడూరుకు చెందిన డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్‌ను బీజేపీ ఆంధ్రప్రదేశ్ మైనార్టీ మోర్చా ట్రెజరర్‌గా నియమించారు. ఈ సందర్భంగా బీజేపీ మైనార్టీ నాయకులు డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్‌కు పూల బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "దేశమంటే మట్టి కాదుడ దేశమంటే మనుషులే. భారతదేశ ప్రతి పౌరుడు దేశ సంస్కృతి, గౌరవాన్ని కాపాడే తత్వంతో ముందుకు సాగాలి" అని అన్నారు. నేటి యువతే రేపటి భారతదేశ గౌరవమని పేర్కొన్నారు. గొప్ప సిద్ధాంతాలతో దేశ సంస్కృతి, దేశ గౌరవాన్ని కాపాడుతున్న ఏకైక పార్టీ భారత జనతా పార్టీ అని పేర్కొన్న ఆయన, భారత్ అంటే భారతదేశం, జనతా అంటే ప్రతి పౌరుడు, పార్టీ అంటే భారతదేశ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ భరతమాత గర్వించదగ్గ బిడ్డలనే అర్థమని వివరించారు. అటువంటి గొప్ప సిద్ధాంతాలు కలిగిన భారత జనతా పార్టీలో తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు ఆంధ్రప్రదేశ్ మైనార్టీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనుకుమ్ విజయం, మయ్యానం జకియా హోనం, స్టేట్ వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రెటరీలు, బీజేపీ మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో చంద్రబాబు లోకేష్ వర్క్‌షాప్‌కు రాష్ట్ర నేతల హాజరు.



శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి, 06 :

విజయవాడ మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మరియు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన తెలుగుదేశం పార్టీ వర్క్‌షాప్ శిక్షణ తరగతులు ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి. నరసింహ యాదవ్, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ మిన్నల రవి, రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం. సుబ్బయ్య, రాష్ట్ర బీసీ విభాగ కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు పాల్గొన్నారు.

అలాగే శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, తొట్టంబేడు మండల సింగిల్ బెడ్ అధ్యక్షుడు భాస్కర్ ముదిరాజు, మండల ప్రధాన కార్యదర్శి మనీ, రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ అధ్యక్షుడు కోట చంద్రశేఖర్, టీడీపీ యువత నాయకుడు చందు తదితర నాయకులు హాజరై శిక్షణ తరగతులను విజయవంతం చేశారు.

పార్టీ బలోపేతం, కేడర్ శక్తివంతీకరణే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్‌లు నిర్వహించినట్లు నేతలు తెలిపారు.

## దుబారా ఖర్చులు తగ్గించేసాం

### -మేయర్ రూప్ కుమార్ యాదవ్

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 6.



నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పట్టణ ప్రణాళిక విభాగం వారాంతపు సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. నగరపాలక సంస్థకు సంబంధించిన దుబార ఖర్చులను దాదాపు తగ్గించేసామని తెలిపారు. కార్పొరేషన్ కు ఆదాయం తీసుకువచ్చే ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ పరకాలపై ప్లానింగ్ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్ పథకాల అమలు కోసం అందుకున్న దరఖాస్తులను ఆన్లైన్లో పరిశీలించి పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మేయర్ సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ బి.పి.ఎస్ పథకంపై అర్హులందరికీ అవగాహన కల్పించి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునేలా ప్రతి ఒక్క ప్లానింగ్ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని సూచించారు. నక్ష సర్వే ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత కేటాయించి ప్రతి ఒక్కరు నిర్దేశించిన గృహాలకు సర్వేను క్రమం తప్పకుండా ప్రతీరోజూ చేపట్టాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మంగా చేపడుతున్న నక్ష సర్వే ప్రాజెక్ట ద్వారా ప్రజలకు కలిగే ఉపయోగాలను వివరించి వారి సంపూర్ణ సహకారాన్ని అందుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీలు వేణు, సతీష్, టి.పి.బి.ఓ లు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ, స్వచ్ఛ రథాలను ప్రారంభించిన ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్



గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,6:

రాజ ముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో కొండాగుంట, కొమ్మనేటూరు గ్రామాలకు చెందిన రైతులకు గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పట్టాదారు పాస్‌బుక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై అధికారులతో చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామాల నుండి ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమంలో భాగంగా గూడూరు, చిట్టమూరు మండలాలకు కేటాయించిన స్వచ్ఛ రథం వాహనాలను గూడూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్ ప్రారంభించారు. గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## జానకిరామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

### పార్థివదేహానికి నివాళులర్పించిన కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎంఎల్సీ మురళీధర్





గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,6:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి మరణం పార్టీకి తీరని లోటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్ అన్నారు. శుక్రవారం చిల్లకూరు మండలం వరగలి గ్రామంలో జానకిరామిరెడ్డి నివాసం వద్ద వారి పార్థివదేహానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ కోసం, ప్రజల కోసం జీవితాంతం అంకితభావంతో సేవలందించిన నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరని విషాదమని పేర్కొన్నారు. జానకిరామిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని వారు ఆకాంక్షించారు.

## రైతుల పొలాల వద్దకే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి

కోవూరు పెన్ పవర్ ఫిబ్రవరి 6



ఈరోజు కోవూరు మండలంలోని ఇనమడుగు గ్రామం నందు' మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఆదేశాల మేరకు మరియు కోవూరు నియోజకవర్గ శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచనల మేరకు"ఇనమడుగు గ్రామంలో రైతుల పొలాల వద్దకే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కోవూరు మండల డిప్యూటీ తాసిల్దార్ బషీర్ సచివాలయ సిబ్బందితో కలసి కోవూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా రైతుల పంట పొలాల దగ్గరే పట్టాదారు పాసుపుస్తకాలను మరియు ఈ కేవైసీ పూర్తి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు " కోవూరు మండల కార్యనిర్వహక కార్యదర్శి ఎస్.కె . సుభాన్.ఇనమడుగు గ్రామ ఉపసర్పంచ్ చేజర్ల.మోహన్' పులి. విజయ ప్రత్తిపాటి. మునీంద్ర.పప్పు.వెంకటేశ్వర్లు 'హజరత్ ఎస్.కె .ఖలీల్ తదితరులు పాల్గొనడం జరిగింది

## టీటీడీ ఈవోగా బాధ్యతలు.

తిరుమల,పెన్ పవర్,ఫిబ్రవరి 6.



టీటీడీ ఈ ఓ గా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు చేపట్టారు శుక్రవారం తిరుమలలోని శ్రీవారి ఆలయానికి చేరుకున్న దంపతులు ఇరువురు భూవరాహ స్వామిని మొదట దర్శించుకున్నారు అనంతరం ముద్దాడ రవిచంద్ర కుటుంబం వైకుంఠం క్యూ కాంప్లెక్సు ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపంలో కొలువు తీరారు. రంగనాయకుల మండపంలో ఈ ఓ గా బాధ్యతలు తీసుకున్నారు. ఆలయ అర్చకులు ముద్దాడ రవిచంద్ర దంపతులకు ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలను టీటీడీ అదనపు ఈ ఓ వెంకయ్య చౌదరి చేతులు మీదుగా స్వీకరించారు. కాగా ఈవో కార్యాలయానికి చేరుకోవడంతో టీటీడీ అధికారులు అభినందనలు తెలిపారు,.ఈ కార్యక్రమంలో టిటిడి సి వి ఎస్ ఓ మురళీకృష్ణ, జేఈవో వీరబ్రహ్మం, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## నేటి ఉదయం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 6.



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.ప్రతి రోజు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ ప్రజలకు ఉదయం 7గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నాము. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నిర్విరామంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కారం దిశగా చేపట్టవలసిన చర్యలు అధికారులతో కలసి ఎప్పటికపుడు సమన్వయం చేస్తున్నాం, పరిష్కారం అయ్యే ప్రతీ సమస్యను పరిష్కరిస్తాం .టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పై కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ, నెల్లూరు పార్లమెంటరీ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ నెల్లూరు మురళి,నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి మైనారిటీ అధ్యక్షుడు షేక్ అస్లాం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ మెంబర్ మణికల నాగమణి, 28వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు చెక్క సాయి సునీల్, టిడిపి నాయకులు దిలీప్ రెడ్డి, మాసా శ్రీనివాసులు, అనిల్ కుమార్ , బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా డ్రగ్స్ సప్లై చేసే స్టూడెంట్స్ ఏ టార్గెట్ అని, స్టూడెంట్స్ మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలి

కొడవలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 6. అడిషనల్ ఎస్పీ సౌజన్య సూచించారు

కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గంజాయి ట్రెండింగ్ లో ఉందని, వివిధ రూపాలలో దీనిని అక్రమంగా తరలిస్తున్నారని వీటి పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సరదాకు ఒకసారి దీనికి అలవాటు పడితే బానిసలు అవుతారని, కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని సూచించారు. గంజాయి రహిత సమాజానికి యువత సహకరించాలని, యువత కుటుంబంతో పాటు ప్రజలకు వీటిపై అవగాహన కల్పించాలన్నారు. గంజాయి విక్రయించిన సేవించిన ఎలాంటి సమాచారం ఉన్న వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ డిఎస్పి ఘట్టమైన శ్రీనివాసరావు కొడవలూరు సిఐ సురేంద్రబాబు, మహిళా పోలీసు సీఐ సుబ్బారావు, కొడవలూరు ఎస్సై కోటిరెడ్డి,విడవలూరు ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.



# మోదీ తరుపు భక్తుల ప్రయోజనం కోసమే వీబీజీ రామ్ జీ చట్టం

## - వైఎస్ షర్మిల ధ్వజం

పలమనేరు,పెన్ పవర్,ఫిబ్రవరి 06,
మోదీ తరుపు భక్తుల ప్రయోజనం కోసమే వీబీజీ రామ్ జీ చట్టం తెచ్చారని ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం గంగవరం మండల కేంద్రంలోని నల్లగుట్లపల్లి గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బీవీఎం శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ పరిరక్షణ యాత్ర కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈసందర్భంగా నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ..
ఉపాధిహామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగించిన అభినవ గాడ్సే నరేంద్రమోదీ అని ఆమె అభివర్ణించారు.ఆయన అధికారంలో సంవత్సరానికి 125 రోజుల పని కల్పన పిచ్చి బూటకం,సగటున 52 రోజులు పని కల్పించలేనోళ్లు 125 రోజులు అంటే నమ్మాలా? అన్నారు. కరువు పని పేదవాడికి బరోసా కల్పించిన పథకం,పేదవారి జీవితాన్ని గ్యారెంటి చేసిన పథకం,అప్పట్లో వైస్సార్ హయాంలో పథకం అద్భుతంగా అమలైందన్నారు.
నేడు మోదీ పాలనలో ఉపాధికి గ్రహణం పట్టిందని,పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారన్నారని,అంతా అవినీతిమయం చేశారని,చేసిన పనికి వేతనాలు కూడా ఇవ్వకుండా కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.మన్రేగా కింద ఏడాదికి దేశంలో అయ్యే ఖర్చు 86వేల కోట్లు,ఈ భారాన్ని తగ్గించడానికి, లేదా బీజేపీ కాంట్రాక్టర్లకు ఈ నిధులు అప్పజెప్పేందుకు కొత్త పథకం తెచ్చారు. మన్రేగా పథకాన్ని చంపి వీబీజీ ఏ రామ్ జి చట్టం తెచ్చారన్నారు.ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించారు.ఆనాడు గాంధీని చంపింది గాడ్సే,నేడు గాంధీ పేరు తొలగించి మోడీ సైతం మళ్లీ చంపారని,గాంధీ పేరు తొలగించిన అభినవ గాడ్సే మోడీ అని ధ్వజమెత్తారు.ఉపాధి హామీ పథకంలో ఊపిరి తీశారు,పూర్తిగా ఈపథకం తీరు తెన్నులను కొత్త చట్టంలో మొత్తం మార్చివేశారు.మన్రేగా కింద పని పేదవాడికి ఒక హక్కు,అడిగిన వెంటనే 15రోజుల్లో పని కల్పించాలి,పని ఇవ్వకపోతే బృతి కూడా ఇవ్వాలి,కానీ ప్రస్తుత వీబీజీ రామ్ జీ చట్టంలో పని హక్కుగా లేదు.పని కావాలంటే గ్రామసభల నిర్ణయం కాదు,పనిని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.
మన గ్రామంలో ఏం పనులు చేయాలో ఢిల్లీలో కూర్చున్న వాళ్లకు ఏం తెలుసు?, గ్రామసభల నిర్ణయాన్ని రద్దు చేయడం దారుణం,100 రోజుల నుంచి 125 రోజుల పని అని గొప్పగా చెప్తున్నారు,125 రోజుల పని కల్పన అనేది బూటకం,పచ్చిఅబద్ధం.
మన్రేగా కింద సగటున 52 రోజులు కల్పించలేక పోయారు,ఇప్పుడు 125 రోజులు పని కల్పిస్తాం అంటే ఎవరి చెవుల్లో పూలు పెడుతున్నారని ప్రశ్నించారు.కొత్త చట్టం కింద రాష్ట్రాలపై 40శాతం భారం మోపారు,గతంలో 100 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేది, ఇప్పుడు 40శాతం నిధులు రాష్ట్రం ఇవ్వాలంటే ప్రస్తుత పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్ కి పెనుభారం అవుతుంది.ఇప్పటికే రాష్ట్రం 10లక్షల కోట్ల అప్పుల్లో ఉంది.మన్రేగా కింద ఇప్పటి వరకు రాష్ట్రానికి అయ్యే ఖర్చు ఏడాదికి 500 కోట్లు మాత్రమే.ఇపుడు 40 శాతం



నిధులు రాష్ట్రం పెట్టుకోవాలి అంటే రాష్ట్రంపై పడే భారం 5వేల కోట్లు.ఇది చంద్రబాబు ప్రభుత్వం భరిస్తుందా? రాష్ట్రానికి భారమైన కొత్త చట్టానికి ఎందుకు మద్దతు ఇచ్చారని,మీరు నిధులు విడుదల చేయకపోతే కేంద్రం 60శాతం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వలేదు,
ఫలితంగా పథకం ఆగిపోతుంది.
రాష్ట్రంలో మళ్లీ పేదల ఆకలి చావులు మొదలు అవుతాయి. రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు మళ్లీ వలసలు పెరుగుతాయి
మోదీ తెచ్చిన వీబీజీ రామ్ జి చట్టం పేదల పొట్టకొట్టే చట్టమని,
దీన్ని ప్రజలు కూడా వ్యతిరేకించాలన్నారు.
మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పోరాటం చేస్తూనే ఉంటుందని,ప్రజలు కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని ఆమె పిలుపు నిచ్చారు. ఇందులో డీసీసీ ప్రెసిడెంట్ భాస్కర్ మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

# పలమనేరు పట్టణ ప్రజల త్రాగునీటి పరిష్కారానికి చర్యలు

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 06.
పలమనేరు పట్టణ మరియు పరిసర ప్రాంత గ్రామాలలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎద్దుల సంతవీధిలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను శుక్రవారం ఆయన పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఇక్కడి వాటర్ ట్రీట్మెంట్ ప్లాట్ 2019 వరకు పనిచేస్తుందని అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తిరిగి రూ.46 లక్షలతో ఈ ప్లాంట్ ను పునరుద్ధరించి ప్రారంభించడం జరుగుతోందని తెలిపారు.పట్టణ మరియు పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ 15.80 కోట్లతో పైప్లైన్ పనులు 32 కిమీ మేర చేపట్టనున్నామని దీంతో శుద్ధమైన జలాలను ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఇక కౌండిన్య ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించ తలపెట్టిన గంగన్న శిరస్సు ప్రాజెక్టుకు అటవీ అనుమతులు రావాల్సి ఉందని,దాంతోపాటుగా కౌండిన్యకు హంద్రీనీవా ను లింక్అప్ చేయడమే గాక గాలేరు నగరి ద్వారా జిల్లాలోని



పడమటి ప్రాంతాలలో సాగు మరియు తాగునీటికీ ఇబ్బందులు రాకుండా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. వీటితోపాటు జలజీవన్ మిషన్ ద్వారా 3వేల కోట్లతో గ్రామీణ ప్రాంతాలలో ఇంటింటికి కొళాయిల ద్వారా శుద్ధి చేయబడిన జలాలను అందించ నున్నామన్నారు.గడిచిన వైకాపా ప్రభుత్వ ఆర్థిక అరాచకాల వలన అభివృద్ధి పనులన్నీ జాప్యం జరుగుతున్నాయని, ఏదేమైనా కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో కరువు ప్రాంతాలన్నిటి లోనూ సాగు, తాగునీటిని అందించే లక్ష్యంతో పని చేస్తున్నామని ఆయన తెలియజేశారు. అనంతరం మొక్కలను నాటి అక్కడికి సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ను ఆయన



ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రోజువారి ఓపి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ.రమణారెడ్డి, బాలాజీకోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న,మున్సిపల్ కౌన్సిలర్లు కిరణ్ కుమార్,బిఆర్సి కుమార్,సునీత నాగరాజు,శారదా సుబ్రహ్మణ్యం నాయకులు ఆర్బిసి కుట్టి,గిరి,ఖాజా,కృష్ణ మూర్తిగౌడ్,మదన్, మాబాషా,నాగరాజు, భాస్కర్, వెంకటరమణ, శ్రీనివాసులు మరియు మున్సిపల్ అధికారులు,సిబ్బంది తదితరులు ఉన్నారు

# తిరుపతి లో విద్యార్థి సంఘ నాయకులపై జరిగిన కిడ్నాప్ ను ఖండించండి. ఎస్ఎఫ్ఐ

ఆత్మకూర్ పెన్ పవర్ ఫిబ్రవరి 6.
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో విద్యార్థి సంఘ నాయకుల పై జరిగిన కిడ్నాప్ ను ఖండించాలని మరియు విద్యార్థి సంఘ నాయకులకు దౌర్జన్యంగా దాడి చేయడాన్ని ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు పట్టణ కమిటీ తరపున ఖండిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా అధ్యక్షులు టి విక్రమ్ మీడియా ముఖంగా మాట్లాడుతూ ఏదైతే తిరుపతిలో ఉన్నటువంటి మోహన్ బాబు యూనివర్సిటీ సంబంధించి విద్యార్థుల నుంచి ఫీజుల దోపిడీ చేయడానికి వ్యతిరేకిస్తూ తిరుపతి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుసార్లు ధర్నా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అయితే తమ మొండి వైఖరి వీడకుండా విద్యార్థుల నుంచి అదే విధంగా ఫీజులు వసూలు చేయడం మరియు విద్యార్థులను ఇబ్బందులు గురిచేస్తున్నటువంటి కళాశాల సంబంధించి ఎస్ఎఫ్ఐ తిరుపతి కమిటీ ఆధ్వర్యంలో మరియు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేసే అంతకు వెళ్తున్న సమయంలో దారి మార్గంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులైనటువంటి అక్బర్, వినోద్ లను దుర్మార్గంగా కిడ్నాప్ చేసి వారిపై దాడులు జరపటాన్ని ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కమిటీ ఖండిస్తున్నామన్నారు. ఈ యొక్క ఘటన కేవలం విద్యార్థి సంఘ నాయకులను కిడ్నాప్ చేయడం కాదు ఏదైతే ప్రైవేటు యూనివర్సిటీలో ఉన్నాయో వాటికి సంబంధించి విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం మరియు ఇష్టానుసారంగా ఫీజులు కనీసం రెగ్యులేషన్ లేకుండా వస్తువులు చేసేటువంటి పరిస్థితులేవైతే ఉన్నాయో వీటికి



సంబంధించి ప్రతి ఒక్కరు కూడా కలం విప్పి ప్రశ్నించాల్సినటువంటి పరిస్థితి ఉందని వారు అన్నారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించటం జరిగింది అనంతరం ఆర్డీవో ఒక ఘటనను ఖండించాలని వినేత పత్రం అందజేయటం జరిగింది ఈ మొక్క కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు పట్ల నాయకులు షేక్ ఖాదర్ బాషా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# దేశవ్యాప్త సమ్మె జయప్రదానికి సిఐటియు పిలుపు

## పాపా నాయుడు పేటలో ప్రచారం ప్రారంభం.

ఏర్పేడు ,పెన్ పవర్, ఫిబ్రవరి ,06 :
ఎర్పేడు మండలం పాపా నాయుడు పేట గ్రామంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె గోడపత్రికను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు సిఐటియు మండల కన్వీనర్ రాంబాబు మాట్లాడుతూ కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే ఈ సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు సంఘం జిల్లా నాయకులు రంగయ్య, వెంకటాద్రి, వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజా వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు షేక్ కరీముల్లా, ఆటో కార్మికులు తదితరులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని నినాదాలు చేశారు.



# సిట్ రిపోర్టు చదవకుండానే లడ్డులో కల్తీ లేదని వైసిపి నేతలు చెప్పడం హాస్యాస్పదం..

ఆత్మకూర్ పెన్ పవర్ ఫిబ్రవరి 6.
ఆత్మకూరు జనసేన నేత చదలవాడ వైసిపి తమ ప్రభుత్వం హయాంలో వందలాది స్కామ్లు చేస్తూ చివరికి దేవున్ని కూడా వదలకపోవడం హాస్యాస్పదం అని తెలుపుతూ లడ్డు కల్తీపై నిరసన వ్యక్తం చేసిన ఆత్మకూరు జనసేన పార్టీ నేత చదలవాడ హరీష్ కుమార్... ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట తిరుపతి లడ్డు విషయమై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఈ ఆత్మకూరు జనసేన నేత చదలవాడ హరీష్ కుమార్ తమ పార్టీ నేతలతో కలిసి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.. లడ్డూలో కలిపిన నెయ్యిలో కల్తీ జరిగిందని సిట్ రిపోర్టులో ఉన్న ఆ రిపోర్టు చదవడం చేతకాని వైసిపి వాళ్ళు కల్తీ లేదని సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో చదలవాడ హరీష్ కుమార్ తో పాటు జనసేన పార్టీ నేతలు ఏఎస్ పేట మండల కన్వీనర్ అక్బర్ భాష, దాడి. సంగం భాను కిరణ్ , పసుపులేటి శ్రీరామ్, మర్రిపాడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

# గంగవరం సిఐ.ప్రసాద్ జీడీ.నెల్లూరుకు బదిలీ

పలమనేరు,పెన్ పవర్,ఫిబ్రవరి 06,
గంగవరం మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ బదిలీ అయ్యారు.ఈ మేరకు ఆయనను గంగవరం నుండి జీడీ.నెల్లూరుకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.కాగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ విధి నిర్వహణలో కొన్ని విషయాలలో నిక్కచ్చిగా వ్యవహరించినా,కొన్ని కేసులలో మాత్రం అనుకున్నంత పురోగతి సాధించలేదని,కేసులలో నేరస్తులను అదుపులోకి తీసుకోవడములో జాప్యం జరుగుతోందని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి.ఆయన బదిలీపై వెళ్లడంతో పలువురు సీఐ సేవలు గుర్తు చేసుకున్నారు. గంగవరం నూతన సీఐగా రాంభూపాల్ రానున్నారు.



# ప్రభుత్వ బడుల్లో కూడా భారీగా అడ్మిషన్లు జరగాలి

## -కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 06, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు నమోదు కావాలని శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి సూచించారు.ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంచే ఉద్దేశంతో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన ఉపాద్యాయుల నుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మరియు పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ బడులలో ప్రైవేటు నుంచి విద్యార్థుల నమోదు జరగాలన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పనులను బలోపేతం చేయాలని దృఢ సంకల్పంతో పనిచేస్తే తప్పకుండా ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం వస్తుందన్నారు. దాంతోపాటు విద్యార్థులు తల్లిదండ్రులకు మెరుగైన విద్యా ప్రమాణాలు ప్రభుత్వ పాఠశాలలలోనే లభిస్తుందనే అంశాన్ని విపులంగా తెలియజేసి విద్యార్థులు ప్రభుత్వ బడుల వైపు మొగ్గు చూపేలా ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం తరపున ఉపాధ్యాయులకు మరియు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించేందుకు కృషి చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు కాబట్టి గతంతో పోలిస్తే ఈఏడాది విద్యార్థుల నమోదు బాగా పెరగాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి,బాల సుందరం,హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నేతాజీ,ధర్మేంద్ర,జగ్గయ్య,ఉపాధ్యాయ సంఘనాయకులు లక్ష్మీనారాయణ,వి.భాస్కర్,ఎం.భాస్కర్,సాలేహా,రజాక్,ఆరిఫ్,వెంకటప్ప,రమారాణి, మంజుల,ఇందిర, పూర్ణచంద్ర,చంద్రిక, రేష్మ,ఖాదరాలి,సురేష్, విజయ్ కుమార్, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

# యూఎఫ్ఎస్ సర్వే ఉద్యోగులకు బిఎల్ఓ, సెన్సస్ తరహాలో అదనపు భత్యం చెల్లించాలి

## -ఏపీఎన్జీజీఓ సంఘం అధ్యక్షులు ఆనందబాబు.



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 06,
ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో క్షేత్రస్థాయి ఉద్యోగులు పడుతున్న శ్రమను ప్రభుత్వం గుర్తించాలని ఏపీఎన్జీజీఓ సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షులు కె.ఆనందబాబు శుక్రవారం డిమాండ్ చేశారు. ప్రస్తుతం బిఎల్ఓ విధులకు మరియు గతంలో జనగణన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏవిధంగా నైతే ప్రత్యేక పారితోషికం మరియు ఇతర భత్యాలు అందించాయో,అదే రీతిన ఈ సర్వే చేస్తున్న వారికి కూడా అదనపు భత్యం మంజూరు చేయాలని కోరారు. కార్యాలయ పనివేళలు కాకుండా,లక్ష్యాలను చేరుకోవడానికి అదనపు గంటలు పనిచేస్తూ,ఉద్యోగులు తీవ్రఒత్తిడికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సొంత సెల్ ఫోన్లు,డేటా రీఛార్జీలు మరియు రవాణా ఖర్చులను ఉద్యోగులే భరించడం వల్ల వారిపై ఆర్థిక భారం పెరుగుతోందని,వెంటనే సర్వే ప్రత్యేక అలవెన్స్ ప్రకటించాలని కోరారు. ఈ సమస్యను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి,సర్వేలో నిమగ్నమైన ఉద్యోగులందరికీ న్యాయం జరిగే వరకు పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ సంరక్షణ యాత్రలో షర్మిల రెడ్డి కోటపోలూరులో సభ ఏర్పాట్ల పరిశీలన.

శ్రీకాళహస్తి,పెన్ పవర్, ఫిబ్రవరి,06 :
పిసిసి అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి , ఉపాధి హామీ సంరక్షణ యాత్రలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని కోటపోలూరు గ్రామం వద్ద నిర్వహించనున్న సభ ఏర్పాట్లను కాంగ్రెస్ నేతలు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా తీసుకువస్తున్న వీబీగ్రామగ్ చట్టానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ఆ చట్టం వల్ల కలిగే నష్టాలను వివరించారు. జిల్లాల పర్యటనలో భాగంగా షర్మిల రెడ్డి కోటపోలూరు గ్రామానికి విచ్చేయనున్న నేపథ్యంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలగురవం బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తమటం వెంకట నరసింహులు, జనతా శ్రీనివాసులు, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త మామందూరు వెంకటాచలపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, రాజారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ రాయల్తో పాటు జానకి రామయ్య, చంద్రశేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



# ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు పాతూరు శివాలయంలో కుంభ మాస తిరునాళ్లు

## - పోస్టర్ ఆవిష్కరించిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 6
కావలి పట్టణంలోని పాతూరు శివాలయంలో ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు 11 రోజుల పాటు జరగనున్న కుంభ మాస తిరునాళ్లకు సంబంధించిన పోస్టర్ను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతూరు శివాలయం కుంభ మాస తిరునాళ్లు భక్తులందరికీ ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని అందించే పర్వదినాలని పేర్కొన్నారు. ఈ 11 రోజుల వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివుడి ఆశీస్సులు పొందాలని కోరారు.అలాగే తిరునాళ్ల నిర్వహణలో ఆలయ కమిటీ, నిర్వాహకులు తీసుకుంటున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే అభినందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# సోమశిల హై లెవెల్ కెనాల్ నిర్మాణం ప్రారంభించి 14 సంవత్సరాలు.

అనంతసాగరం పెన్ పవర్ ఫిబ్రవరి 6.



52 గ్రామాలలో 2,35 000 మందికి తాగునీరు, 90,000 ఎకరాల పొలానికి సాగునీరు 5 టీఎంసీ లు అందించే ఆత్మకూరు ఉదయగిరి నియోజకవర్గాల 6 మండలాల వ్యవసాయానికి ఊతమిచ్చే పథకం.

2026-27 ఫిబ్రవరి నెల 14వ తేదీన ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో నిధులను కేటాయించి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని వెనుకబడిన ప్రాంతాలైన మర్రిపాడు దుత్తలూరు వింజమూరు అనంతసాగరం ఆత్మకూరు ఉదయగిరి ప్రాంతాల అభివృద్ధికి నిధులను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఫిబ్రవరి నెల 10వ తేదీన మర్రిపాడు మండల హెడ్ క్వార్టర్స్ మర్రిపాడు లో జరుపబోయే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయండి.

# మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, టీడీపీ నాయకులు

ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 6.



ఆత్మకూరులో మహాశివరాత్రి వేడుకలపై అధికారుల సమీక్ష ఈ నెల 15వ తేదీన జరగనున్న మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాల సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని తిరుణాల తిప్ప వద్ద ఉన్న పుణ్యక్షేత్రం కాశీనాయన ఆశ్రమంలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్లు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులతో మాట్లాడిన వారు, మహాశివరాత్రి రోజున నిర్వహించనున్న పూజా కార్యక్రమాలు, భక్తులకు కల్పించనున్న సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉత్సవాలకు హాజరవుతారని, ఆయన సహకారం కూడా అందుతుందని నిర్వాహకులు తెలిపారు. అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తయ్యేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలకు ప్రత్యక్ష స్పందన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా ప్రజా దర్బార్




శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి ,06 :
శ్రీకాళహస్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి స్థానిక ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వీకరించారు. గ్రామాలు, పట్టణ పరిధిలో నెలకొన్న మౌలిక సదుపాయాల లోపాలు, పింఛన్లు, రోడ్లు, త్రాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా మాట్లాడి ప్రజల సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల కష్టాలు తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొంటూ, ప్రతి ఫిర్యాదుపై గట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉండే విధంగా ప్రజా దర్బార్‌ను నిరంతరం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## చెన్నూరు రోడ్డు: ఆక్రమణల ముసుగులో

# వ్యాపారుల దందా

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 6.
పట్టణ జీవన రేఖ. కానీ నేడు అదే రహదారి అక్రమ ఆక్రమణలతో నలిగిపోతూ ప్రజలకు శిక్షగా మారింది. ఫుట్‌పాత్‌లు కనిపించవు. రోడ్డు వెడల్పు తగ్గిపోయింది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సైతం ఇరుక్కుపోయే పరిస్థితి. ఇది అభివృద్ధి లోపమా? లేక ఆక్రమణల పేరుతో ఏర్పడిన వ్యవస్థ వైఫల్యమా అన్న ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి. చెన్నూరు రోడ్డు అత్యధిక ట్రాఫిక్ ఉన్న వీధి. అయినా ఈ రోడ్డుపై వీధి వ్యాపారులు, తోపుడు బండ్లు, షాపుల విస్తరణలతో రహదారి క్రమంగా సంకుచితమైంది. సమస్య కేవలం ఫుట్‌పాత్‌ల వరకే పరిమితం కాలేదు. డ్రైనేజీ కాలువలు సైతం ఆక్రమణల పాలయ్యాయి. వర్షం పడితే నీరు రోడ్డుపైకి వచ్చి ప్రజలు నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. అయినా ఈ అక్రమాలపై చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో పరిస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే, ఆక్రమణలు తొలిగించి రోడ్డు విస్తరణ చేపట్టాలని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ పటిష్టం చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆక్రమణల తొలిగింపు అంశం ఒక్కసారిగా చర్చకు వచ్చింది. అయితేడ ఆ నిర్ణయమే వ్యాపారులను రోడ్డెక్కించింది. ఆందోళనలో ఉన్న వ్యాపారులు "ఉపాధి పోతుంది", "పేదల కడుపు కొట్టే చర్య" అంటూ నినాదాలు చేస్తున్నారు. కానీ ఈ నిరసనల వెనుక దాగి ఉన్న మరో కోణం ఇప్పుడు బయటపడుతోంది. స్థానికంగా ప్రతి షాపు యజమాని దగ్గర నుంచి, తోపుడు బండ్ల వ్యాపారుల నుంచి రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆక్రమణలు కొనసాగుతున్నంత కాలం ఈ వసూళ్లు కొనసాగుతాయి. తొలిగిస్తేడ వ్యాపారుల ఆదాయంతో పాటు ఈ అక్రమ వసూళ్ల వ్యవస్థకు గండి పడుతుందన్న భయం ఇప్పుడు ఆదరణలకు అసలు కారణమన్న వాదన వినిపిస్తుంది ఇక్కడ ప్రశ్న కంటే ప్రజలు ఇబ్బందులు ముఖ్యమా లేక కొందరి లాభాలు రోజు వేలాది వాహనదారులు ట్రాఫిక్ లో చిక్కుకుని నరకం అనుభవిస్తున్నారు పాదాచారులు నడవటానికి చోటు లేదు ప్రమాదాలు పెరుగుతున్నాయి అయినా అక్రమాల పేరుతో కొందరికి లాభాలు ప్రజలకు మాత్రం శిక్షల మారిన ఈ పరిస్థితిని ఇప్పటివరకు భరించలేని అభివృద్ధి అంటే కేవలం రోడ్లు వేయడమే కాదు రహదారులను ప్రజల కోసం సుచితంగా సౌకర్యవంతంగా ఉంచడమే నిజమైన అభివృద్ధి చెందూరు రోడ్డు విషయంలో తీసుకున్న నిర్ణయం ఆ దిశలో ముందడుగు అయితే దానికి అడ్డుపడేదే ప్రతి ప్రయత్నం ప్రజా ప్రయోజనానికి వ్యతిరేకమే అవుతుంది చెల్లూరు రోడ్డు అక్రమాల కథనం





ఒక రహదారి సమస్య మాత్రమే కాదు ఇది వ్యవస్థపై ప్రశ్న ప్రజా ప్రయోజనాలక వ్యక్తిగతంగా లాభాలుగా అన్న పోరాటం ఈ పోరాటంలో గెలిచేది అభివృద్ధి అయినా లేదా అక్రమాలైన జవాబు మాత్రం ఇంకా అధికారులు చేతుల్లోనే ఉంది

# శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పని చేస్తా:

## తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర

తిరుమల/పెన్ పవర్ /ఫిబ్రవరి 06
తిరుమల శ్రీవారిపై భక్తి విశ్వాసాలు సన్నగిల్లకుండా, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పని చేస్తానని ఆంధ్రప్రదేశ్ సీఎంవో ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర అన్నారు. తితిదే ఈవోగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో రవిచంద్ర దంపతులకు పండితులు ఆశీర్వచనం అందజేశారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు సేవచేసే అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి భక్తుడిగా ఎంతో మందికి సేవచేసే భాగ్యం దక్కిందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం, భక్తుల నమ్మకాన్ని నిలబెడతానని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు, అధికారులతో పాటు అందరి సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండేలా పరిపాలన కొనసాగిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న



ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఉంటూనే టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవో బాధ్యతలనూ రవిచంద్ర నిర్వర్తించనున్నారు.

# తిరుపతిలో 'కమల వికాసం' కార్యక్రమంపై బీజేపీ మండల సమావేశం.

శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి ,06 :
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సూచనల మేరకు, రాష్ట్ర అధ్యక్షులుగా పీవీఎన్ మాధవ్, తిరుపతి జిల్లా అధ్యక్షులుగా సామంచి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తిరుపతి పార్లమెంటు జిల్లాలో గత సంవత్సరం కాలంగా చేపట్టిన కార్యక్రమాలపై అవలోకనం చేసుకునేందుకు 'కమల వికాసం' కార్యక్రమంపై మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం 9 గంటలకు తిరుపతి పట్టణంలోని కచాపి ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీకాళహస్తి అసెంబ్లీ పరిధిలోని పార్టీ కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి సభ్యులు, అభిమానులకు నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కూనాటి నాగ రాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞ, సీనియర్ నాయకులు కుప్పా ప్రసాద్, మండల అధ్యక్షులు ఏడం కృష్ణయ్య, రాఘవ కుప్పం హరీష్ రెడ్డి, భగీర్తి వెంకటేష్, పుణ్యం ఢిల్లీ కుమార్, ఇమిడి శెట్టి మోహన్ రావు, ఉమాసింగ్, తానికొండల భరత్ నాయుడు, మునిరాజా, రాఘవులు నాయుడు, గోపి, రాజనాల, యతీష్, రమేష్ యాదవ్, తులసి, ధనుష్, శ్రీకర్ నాయుడు, మారి, అంకయ్య, రాజా, అనిల్ తదితరులు పాల్గొన్నారు



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తిరుపతిలో ఎఫ్‌ఆర్‌టీఐ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

## -ఆర్‌టీఐ చట్టం ప్రకారం ప్రజలకు సమయానికి సమాచారం అందిస్తామని అధికారుల హామీ.

తిరుపతి, పెన్ పవర్, ఫిబ్రవరి ,06 :
తిరుపతిలో ఎఫ్‌ఆర్‌టీఐ (ఫోరం ఫర్ ఆర్‌టీఐ) నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎఫ్‌ఆర్‌టీఐ జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్, జాతీయ అధ్యక్షులు మట్టా ప్రసాద్ సూచనల మేరకు, జాతీయ సంయుక్త కార్యదర్శి కుప్పాల అజయ్ ప్రసన్న కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీ వి. సాయి బాబా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీమతి కె.ఎం. రోస్‌మాండ్‌లను కలిసిన ఎఫ్‌ఆర్‌టీఐ నేతలు, ఆర్‌టీఐ చట్టం ప్రకారం ప్రజలు కోరిన సమాచారాన్ని నిర్దేశిత గడువులోపు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు, తమ శాఖల నుంచి సమాచారాన్ని సమయానికి ప్రజలకు అందేలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
అలాగే తిరుమలతిరుపతి పరిసర ప్రాంతాల్లో రెడ్‌సాండల్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవినీతికి తావులేకుండా పవిత్ర పుణ్యక్షేత్రం గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఎఫ్‌ఆర్‌టీఐ నేతలు విజ్ఞప్తి చేశారు. నిజాయితీతో పనిచేసే అధికారులను, అవేర్నెస్ సంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.
దీనికి అధికారులు స్పందిస్తూ, సమాజ సేవలో ముందుండే ఎఫ్‌ఆర్‌టీఐ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా అందేలా సిబ్బందికి దిశానిర్దేశం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాతీయ కమిటీ నేత కె. అజయ్ ప్రసన్న కుమార్‌తో పాటు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కరాటే డీసీఎస్ రాయల్, రాష్ట్ర ఎంప్లాయీస్ ప్రెసిడెంట్ ఎం. సుధాకర్ యాదవ్, జిల్లా మహిళా ఇన్‌చార్జి అధ్యక్షురాలు వి. జయలక్ష్మీ, తిరుపతి నగర కమిటీ అధ్యక్షులు జి. వేణుగోపాల్ పాల్గొన్నారు.



# జగన్ మారినట్టేనా సామాన్యులకు దొరకని అపాయింట్ మెంట్



**గుంటూరు, ఫిబ్రవరి 6, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని గుర్తించాలి. తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి వచ్చి కలసి ఫొటోలు దిగి స్టేటస్ గా పెట్టుకున్న వారికే పదవులు ఇవ్వకుండా గ్రామాల్లో ఎవరు నిజంగా కష్టపడుతున్నారు? ఎవరికి జనంలో బలం ఉందన్నది చూడాలి. అది తెలుసుకోవాలంటే కేవలం కోటరీమీదనో.. స్థానిక నాయకుల మీదనో ఆధారపడితే మళ్లీ చరిత్ర పునరావృతమవుతుంది. ఎందుకంటే నాడు జరిగిన తప్పులే మళ్లీ జరగకుండా ఉండాలంటే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పెరగాలని కోరుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి జగన్ ను తాడేపల్లి కార్యాలయానికి కలవడానికి వచ్చిన వాళ్లకు ఇప్పటికీ జగన్ అపాయింట్ మెంట్ దొరకడం లేదు.జగన్ బయటకు వెళితే కార్యకర్తలు బాగానే వస్తున్నారు. వారు వస్తున్నది కూడా యాభై శాతం జగన్ మీద అభిమానం అయితే..మిగిలిన యాభై శాతం స్థానిక నాయకుల మీదన్న విషయం గుర్తుంచుకోవాలంటున్నారు. వైసీపీలో లో ఎప్పుడు నిజంగా కష్టపడే వాడికి ఫలితం దక్కేది ఎప్పుడంటూ సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి నియోజకవర్గంలోనూ రెండు మూడు వర్గాలున్నాయి. మాజీ ఎంపీ వర్గం, మాజీ ఎమ్మెల్యే వర్గం, జగన్ కి వ్యక్తిగత పరిచయం అని చెప్పుకునే మరొక వర్గం ఇలా మూడు గ్రూపులుగా అన్ని గ్రామాల్లో విడిపోయి తమ వర్గాల వారికి పదవులు ఇప్పించుకోవడానికి తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారుపార్టీ పదవుల నుంచి అన్నీ వారు చెప్పిన వారికే నాయకత్వం కూడా ఇస్తుండటంతో అసలైన, సిసలైన కార్యకర్త మాత్రం డీలా పడిపోయాడు. నియోజకవర్గ పదవులు వేసే క్రమంలో మూడు వర్గాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీంతో మూడు గ్రూపులుగా విడిపోయి నియోజకవర్గాల్లో వైసీపీ కార్యకర్తలు క్రాస్ రోడ్స్ లో ఉన్నారు. జగన్ వచ్చినప్పుడు అందరూ కలసి కట్టుగా కనిపిస్తున్నా ఆ తర్వాత మాత్రం ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరికి ఏ పదవి ఇవ్వాలని అనుకున్న దానికి ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారు. కార్యకర్తల అభీష్టాన్ని తెలుసుకొని ఇస్తే ప్రజాస్వామ్య బద్ధంగా ఎంపిక చేస్తే ఫలితం ఉంటుంది. అంతే తప్ప ఎవరో సిఫార్సుతో పదవులు ఇస్తే పార్టీ అధికారంలోకి రావడం కష్టమే. ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలి.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కరవు భత్యం ఉద్యోగుల హక్కు

**హైదరాబాద్ పెన్ పవర్:** లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టులో గురువారం భారీ ఉపశమనం లభించింది. కరవు భత్యం (డీఏ) పొందడం ఉద్యోగుల చట్టబద్ధమైన హక్కు అని న్యాయస్థానం స్పష్టం చేసింది. 2008–2019 కాలానికి సంబంధించి డీఏను ఉద్యోగులకు చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. బకాయిపడిన మొత్తంలో 25శాతాన్ని మార్చి 6వ తేదీకల్లా ఉద్యోగులకు అందజేయాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం తెలిపింది. అఖిల భారత వినియోగ ధరల సూచీ (ఏఐసీపీఐ) ప్రకారం నిర్ణయించిన డీఏ లెక్కింపు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆఫీస్ మెమోరాండం ద్వారా సవరించడానికి వీల్లేదని పేర్కొంది. 'డీఏ అదనపు ప్రయోజనం కాదు. కనీస జీవన ప్రమాణాల నిర్వహణకు ఇది సాధనం. పౌరుల సామాజిక, ఆర్థిక సంరక్షణ బాధ్యత సంక్షేమ రాజ్య ప్రభుత్వాలదే'నని ధర్మాసనం తెలిపింది. తీర్పు అమలు ఆర్థికంతో ముడిపడి ఉన్నందున మొత్తం డీఏ చెల్లింపు నిర్ధారణ, చెల్లింపుల షెడ్యూల్, విడతల వారీగా నిధుల విడుదల పర్యవేక్షణకు ఓ కమిటీని నియమిస్తున్నట్లు వెల్లడించింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులూ అప్పటి బకాయిలకు అర్హులేనని తెలిపింది. ఏప్రిల్ 15వ తేదీకల్లా స్థాయీ నివేదిక సమర్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. మొత్తం డీఏ బకాయిలు రూ.41వేల కోట్లు ఉంటాయని అంచనా.

# శ్రీనివాసుడితో గేమ్స్..

**తిరుమల, ఫిబ్రవరి 6, పెన్ పవర్:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిందా? అన్నది పక్కన పెడితే భక్తుల మనోభావాలతో మాత్రం రాజకీయ నేతలు ఆటాడుకుంటున్నాయి. ఏడు కొండల వాడితో గేమ్స్ ఇప్పటి నుంచి కాదు దాదాపు ఏడాదిన్నర క్రితమే ప్రారంభమయింది. పాలకులయినా.. ప్రతిపక్షమయినా భక్తుల మనోభావాల పట్ల జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. రాజకీయ ప్రయోజనాలు నేడు వస్తాయి. లేకుంటే రావు. అంతే తప్ప కొన్ని వందల దశాబ్దాల నాటి చరిత్ర ఉన్న తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో మాత్రం పాలక, ప్రతిపక్షాలు భక్తులను పట్టించుకోకుండా రాజకీయ పరమావధిగానే ప్రయాణం చేస్తున్నాయి. ఒక రకంగా ఏడుకొండల వాడిని ఓట్లు తెచ్చి పెట్టే ఒక సాధనంగా భావిస్తున్నాయనుకోవచ్చు.నిజానికి సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. తిరుమల లడ్డూ కల్తీ విషయంలో ఎలాంటి వివాదాలు చేయవద్దని, ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా సరే ఒకిరిని మించి మరొకరు ఈ లడ్డూ ప్రసాదం విషయంలో తప్పటడుగులు వేస్తున్నారు. ఈ వివాదాన్ని సిట్ ఛార్జిషీట్ తర్వాత వదిలేస్తే సరిపోయేది. కానీ దానిని పట్టుకుని లాగినంత మాత్రాన దక్కే ప్రయోజనం మాత్రం ఎవరికీ ఉండకపోవచ్చు. తిరుమల లడ్డూ తయారీ 350 ఏళ్లకు పైగానే సాగుతుంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ లడ్డూ తయారీలో మాత్రం కల్తీ చేయడానికి సాహసించవు. కావాలంటే వేరే మార్గంలో డబ్బులు దండుకునే మార్గం చూసి ఉండవచ్చు కానీ, భక్తులకు అందించే ప్రసాదంలో మాత్రం అటువంటి నీచ చర్యలకు ఎవరూ పాల్పడరు. చివరకు సరఫరా చేసే కంపెనీలు సయితం లాభాపేక్షతో పాటు ఆధ్యాత్మికతతో ఉంటాయన్నది వాస్తవం.సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని, సీబీఐ పర్యవేక్షణలో సిట్ విచారణ జరుపుతుంటే, దానికి సమాంతరంగా రాష్ట్ర ప్రభుత్వం మరో విచారణ కమిటీని వేయడం అంటే దీనిని లాగేందుకే పాలక పక్షం సిద్ధమయింది. కల్తీ జరిగింది అనేది వాస్తవమే అని సిట్ చార్జిషీట్ లో పేర్కొంది. అది సింథటిక్ నెయ్యి అని, అందులో చుక్క పాలు గానీ మీగడ గానీ లేవని తేలింది. అదొక ఘోరమైన నేరం అనడంలో సందేహం లేదు. అయితే ఆ నేరస్తులను శిక్షించడానికి సిట్ నివేదిక సరిపోతుంది. మళ్లీ కమిటీ వేసి సుదీర్ఘంగా సాగదీయడమే పనిగా పాలకపక్షం పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. తిరుమలలో భక్తుల రద్దీ తగ్గలేదు. అంటే ప్రజలు నమ్మడం లేదనే అనుకోవాల్సిందని గుర్తుంచుకోవాలి. సిట్ నివేదిక ప్రకారం బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, అంతే తప్ప ఇక సాగదీయడం శ్రేయస్కరం కాదన్నది గుర్తుంచుకోవాలి.

# విశాఖపట్నం టు రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 6, పెన్ పవర్:** ఏపీ మీదుగా విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పులు వేగవంతం చేశారు. చిన్నయ్యపాలెం దగ్గర ఇంటర్ ఛేంజ్, సూరెడ్డి పాలెం దగ్గర డబుల్ ట్రంపెంట్ కూడా నిర్మాణం చేస్తున్నారు. ఈ పనుల్ని వేగవంతం చేసి వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే రాయ్‌పూర్ 6 గంటల్లో వెళ్లొచ్చంటున్నారు.ఆంధ్రప్రదేశ్ మీదుగా నిర్మిస్తున్న మరో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులపై కీలక అప్డేట్ వచ్చింది. విశాఖపట్నాన్ని రాయపూర్‌తో కనెక్ట్ చేసే ఈ ఆరు లైన్ల ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు సబ్బవరం– షీలానగర్ మధ్య వేగవంతం అయ్యాయి. ఈ హైవే పనుల్లో భాగంగా చిన్నయ్యపాలెం దగ్గర ఇంటరఛేంజ్ నిర్మాణం జరుగుతోంది. అలాగే సూరెడ్డిపాలెం సమీపంలో డబుల్ ట్రంపెట్ కూడా నిర్మాణం చేస్తున్నారు. అక్కడ భూమిని చదును చేసి ల్యాండ్ ఫిల్లింగ్, డ్రైనేజీల నిర్మాణానికి కాలువల్ని తవ్వుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పెద్ద, పెద్ద మెషిన్ల సాయంతో కార్మికులు పనుల్ని చేపట్టారు.సబ్బవరం–షీలానగర్ మధ్య చేపట్టిన హైవే పనుల్లో భాగంగా.. అమృతపురం శివారు సూరెడ్డిపాలెం నుంచి షీలానగర్ మొత్తం 12.66 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోంది. అయితే 8 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో షీలానగర్ దగ్గర ఎన్‌హెచ్–16, విశాఖపట్నం పోర్టు రోడ్డుకు కనెక్ట్ చేస్తారు. గతంలోనే ఈ రోడ్డుకు నిధులు మంజూరైనా భూసేకరణ ఆలస్యం కావడంతో పనుల్లో కూడా జాప్యం జరిగింది. ఇప్పుడు అన్ని సమస్యలు పరిష్కారం కావడంతో పనులు మరింత ఊపందుకున్నాయి. విశాఖపట్నం–రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హైవేను నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. విజయనగరం జిల్లా కంటకాపల్లి నుంచి అనకాపల్లి జిల్లా సబ్బవరం వరకు నాలుగో ప్యాకేజీ కింద పనులు పూర్తి చేశారు. ఈ హైవే చిన్నయ్యపాలెం దగ్గర అనకాపల్లి–ఆనందపురం హైవేలో కలిసేలా ప్లాన్ చేశారు.రాయ్‌పూర్ వైపు నుంచి వచ్చే వాహనాలు కిలోమీటరు దూరంలో ఉండే సూరెడ్డిపాలెం వరకు అనకాపల్లి–ఆనందపురం హైవేలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. అక్కడ డబుల్ ట్రంపెట్ నిర్మాణం జరుగుతోంది.. షీలానగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి, ఆనందపురం, రాయపూర్ వైపు వెళ్లేలా ఈ డబుల్ ట్రంపెట్ నిర్మాణం చేపట్టారు. 2027 చివరికి సబ్బవరం–షీలానగర్ మధ్య ఈ హైవే అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే విశాఖలోని నేషనల్ హైవేపై భారీ వాహనాల రద్దీ తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అంతేకాదు ఈ హైవే మొత్తం అందుబాటులోకి వస్తే విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ 6 గంటల్లో వెళ్లొచ్చంటున్నారు.

**ఫ్రీ సిగ్నల్ జర్నీ**


విశాఖపట్నంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే దిశగా మరో ముందడుగు పడింది. నగరంలో కీలకమైన ఎన్ఏడీ కూడలి దగ్గర కాకానినగర్ దగ్గర ఆర్వోబీ ప్రారంభానికి సిద్ధమైంది. ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు ఇబ్బందులు తొలగిపోతాయని చెబుతున్నారు. ఈ పనునలు ముగింపు దశలో ఉండగా.. ఈ ఆర్వోబీని ఈ నెలలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకానినగర్ కూడలికి సమీపంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కూడా నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో హైవేలు, రైల్వే ప్రాజెక్టుల్ని వేగవంతం చేసింది. విశాఖపట్నంలో కీలకమైన ఆర్వోబీ (రైల్ ఓవర్ బ్రిడ్జి) అందుబాటులోకి రాబోతోంది. నగరంలో కీలకమైన ఎన్ఏడీ కూడలికి వెళ్లేందుకు.. అక్కడి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు ఈజీగా ఉంటుంది. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి కాకానినగర్ కూడలికి వెళ్లేందుకు ఈ ఆర్వోబీ పనులు ముగింపు దశకు వచ్చాయి.. త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయంటున్నారు.వాస్తవానికి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టిన సమయంలోనే ఆ ఆర్వోబీ కూడా రెండేళ్ల క్రితమే పూర్తి చేయాల్సింది.

# తెలుగు సాహితీ పరిశోధనా పితామహుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏదో ఒక రంగాన్ని ఎన్నుకుని అందులోనే జీవితాన్ని గడిపేవారు సామాన్యులు. కోరుకుని ఎన్నుకున్న రంగంలో నిరంతర కృషి సల్పుతూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే వారు అసామాన్యులు. కాలూనిన అన్ని రంగాల్లో విశేష కృషి చేస్తూ, ఆయా రంగాల్లో పరిపూర్ణతను సాధించి, నిష్ణాతులై, ఒక ప్రత్యేక స్థానాన్ని పొందేవారే మహనీయులు. తెలుగు సాహిత్య లోకంలో చివరి కోవకు చెందిన మహనీయులు, మహామహులు వేటూరి ప్రభాకరశాస్త్రి. తెలుగు సాహిత్యానికి సక్రమమైన రూపం కల్పించి, ప్రజలందరికీ అందించే ప్రయత్నంలో తమ జీవితాలను ధారపోసిన మహనీయుల్లో అగ్రగణ్యులు వేటూరి.చరిత్రలో లభ్యమవుతున్న, మొట్ట మొదటిదిగా భావించ బడిన తెలుగు పదము "నాగబు" అని కనుగొన్నది ఆయనే కావడం విశేషం. "భాష అడవి వంటిది– కవిత ఉద్యానవనం వంటిది. ఉద్యానవన పెంపు సొంపులకు అరణ్య పరిశోధన అవసరమైనట్టే సుకవితకి భాషా పరిశోధన అవసరం" అని గట్టిగా నమ్మారు.చిన్నతనంలోనే సంపాదించుకున్న "శతావధాని వేటూరి ప్రభాకరశాస్త్రి" అనే గొప్ప పేరును తృణ ప్రాయంగా త్యజించి, తన జీవితానికి అర్థం పరమార్థం అవధానం కాదని, నిరంతర పరిశోధన అని నిర్ణయించుకుని, పరిశోధనకే అంకితమైన ధన్యజీవి వేటూరి. వేటూరి ప్రభాకరశాస్త్రి (ఫిబ్రవరి 7, 1888 – ఆగష్టు 29, 1950) తెలుగు కవి, భాష పరిశోధకులు, చరిత్రకారులు, రచయిత, విమర్శకులు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితులు. వేటూరి కేవలం మేధావి మాత్రమే కాదు. తెలుగు భాషా, చారిత్రక సాహిత్య నిర్మాణానికి అక్షరాలను పేర్చిన మేస్త్రీ. ఆయన రచయిత మాత్రమే కాదు. విమర్శనా వ్యాస రచనకు ఆద్యులు. పన్నెండో ఏటే పరభాషలో కవిత చేసిన అనన్య సామాన్యులు. పిన్నవయసు శతావధాని. తెలుగు లిపి ప్రాచీనతకు ఆధారంగా దొరుకుతున్న మొట్టమొదటి తెలుగు పదం "నాగబు" గురించి వెలుగు లోనికి తెచ్చిందే వేటూరే కావడం విశేషం. తరువాత కాలంలో అది 'నాగబుద్ధి' అనే పేరులో చివరి అక్షరం మరుగై పోగా 'నాగబు' మాత్రమే శాస్త్రికి దొరికిందని పండితులు తేల్చారు. పదం ఏదయినా మన లిపి ప్రాచీనతను వెదకటానికి అది చాలా తోడ్పడిందనేది కాదన లేని వాస్తవం. ప్రభాకర శాస్త్రి 'నాగబు' తెలుగువారి చరిత్ర గురించిన కొత్త ఆలోచనలకు దోహదపడింది అనేది సత్యం. తొలిసారిగా అన్నమయ్య ఉనికిని లోకానికి చాటి చెప్పింది కూడా ఆయనే. అయిదు శతాబ్దాలకు పైగా మరుగున పడిన పదకవితా పితామహుని గురించి తెలియని పరిస్థితుల్లో అన్నమయ్య జీవితం గురించి, ఆయన రచనల గురించీ ఎన్నో విశేషాలను శాస్త్రి వెలుగులోకి తెచ్చారు. తాళ్ళపాక చిన్నన్న వ్రాసిన "అన్నమాచార్య చరిత్ర"ను పరిష్కరించి ప్రచురించారు. అన్నమాచార్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆయన పదాలకు ప్రాచుర్యం కల్పించారు. సి.పి. బ్రౌను గురించి, తొలి తెలుగు కవయిత్రి తిమ్మక్కను గురించీ ఈ తరానికి తెలియ జేసింది ఆయనే. కాలగర్భంలో కలిసి పోతున్న తెలుగు సంస్కృతీ చరిత్ర పునరుద్ధరకోసం కంకణ ధారియై, దీక్షాదక్షులై సిద్ధి పొందిన తాపసి ఆయన. ప్రభాకరశాస్త్రి, కృష్ణా జిల్లా, మోపిదేవి మండలములో కృష్ణా నది తీరమున ఉన్న పెదకళ్ళే పల్లిలో శ్రీవత్స గోత్రజులైన వేటూరి సుందరశాస్త్రి, శేషమ్మలకు 1888, ఫిబ్రవరి 7 న జన్మించారు. ప్రభాకర శాస్త్రి ప్రాథమిక విద్య స్వగ్రామము లోనే నడిచింది. తండ్రి వద్ద, మద్దూరి రామావధాని వద్ద సంస్కృతాంధ్రములను నేర్చు కొన్నారు. ఉపనయనమైన తర్వాత ప్రభాకరశాస్త్రిని ఆయన తండ్రి శాస్త్రాలు అభ్యసించడానికి చల్లపల్లిలోని అద్దేపల్లి సోమనాథశాస్త్రి వద్ద చేర్పించారు. 16 యేళ్ల వయసులో, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి బందరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిసి కొందరు సహాధ్యాయులతో కలిసి అక్కడ చేరారు. తెలుగులో తనకు తెలిసినదంతా చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రితో ముఖతః వినోద గోష్ఠిలో విని నేర్చుకున్నదేనని ప్రభాకర శాస్త్రి చెప్పుకున్నారు. తన 19వ యేట మద్రాసు చేరి వెస్లీ మిషన్ హైస్కూలులో తెలుగు పండితునిగా రెండేళ్ళు పనిచేశారు. ఆ సమయములో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు వెళ్ళి అక్కడి గ్రంథాలను చదువుతుండే వారు. ప్రభాకరశాస్త్రి, తెలుగులో అనేక కావ్యాలు రచించడముతో పాటు అనువాదాలు, వివరణా గ్రంథాలు రచించారు. ఆయన ప్రాచ్యలిఖిత పుస్తకాలయములో అనేక తెలుగు గ్రంథాలను చారిత్రకాధారములతో సవివరముగా పరిష్కరించి ప్రకటించారు.శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర, ప్రాచీనాంధ్ర శాసనములు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, రెడ్డిరాజులు, చాటుపద్య మణి మంజరి, అన్నమాచార్య కీర్తనలు, తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్క తొలి తెలుగు శాసనము... తదితరాలను ఈరోజు అందుబాటులో

ఉంచడానికి వేటూరి కృషియే కారణం. తమిళ, కన్నడ భాషలతో బాగా పరిచయము ఏర్పరచుకొని, ఆండాళ్ రాసిన కొన్ని తమిళ పాశురాలను తెలుగులోకి అనువదించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో విస్తృత పరిశోధనలు చేశారు. అప్పటి వరకూ వెలుగులోకి రాని ఎన్నో తాళపత్రాలు, శాసనాలు, పుస్తకాలను పరిష్కరించారు. తాను ప్రచురించిన ప్రతి గ్రంథానికీ విపుల పీఠికా నిర్మాణం గావించారు. ముప్పయి సంవత్సరాలు మద్రాసులోనే ఉండి సాహితీ సరస్వతికి ఎనలేని సేవ చేశారు. శాస్త్రి సంస్కృత రూపకాలను తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు సాహితీ లోకంలో లబ్ధప్రతిష్ఠులు, పండితులు, పరిశోధకులు, ప్రాచీన వాఙ్మయ ప్రియులు అయిన వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు దేశంలో బాల బాలికలు పాడే పాటలు, పలికే మాటలు, చెప్పుకునే కథలు కొన్నింటిని సేకరించి 'భారతి' (1930) లో 'బాలభాష' అనే పేరుతో ప్రచురించారు. ప్రభాకరశాస్త్రిని కవిగా, చరిత్ర పరిశోధకులుగా, శాసన పరిశోధకులుగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రచురణకర్తగా, సంస్కృత రూపకానువాదకర్తగా, తాళపత్ర గ్రంథ వివరణ రచయితగా, అన్నమయ్య సంకీర్తన సాహిత్యోద్ధారకులుగా, అన్నమాచార్య ఉత్సవాల ప్రథమ ప్రారంభకులుగా తెలుగు ప్రజలు చిరకాలం గుర్తుంచు కుంటారు. ఆయన తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు, తెలుగువారికి ప్రాతఃస్మరణీయులు.

# వైసిపి పై కూటమి బ్రహ్మాస్త్రం సిద్ధం




**విజయవాడ, ఫిబ్రవరి 6, పెన్ పవర్:** ఏపీ విషయంలో భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రత్యేకంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో సమావేశం కావడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటన నుంచి వచ్చిన వెంటనే పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబుతో సమావేశం అయ్యారు. వారిద్దరి మధ్య సుదీర్ఘ భేటీ కొనసాగింది. ఇది సాధారణ భేటీ కాదని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్ళతో పెకిలించే భారీ వ్యూహంతో జరిగిన సమావేశం అని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లోని ప్రకంపనలు సృష్టిస్తోంది. ముమ్మందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా అంశాల్లో టార్గెట్ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.పవన్ ఢిల్లీ వెళ్లారు. అమిత్ షా తో భేటీ అయ్యారు. అటు నుంచి వచ్చిన వెంటనే జనసేన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే విషయంలో వైఫల్యాలను ప్రస్తావించారు. చివరకు తన సోదరుడు నాగబాబును సైతం తప్పు పడుతూ మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. తిరుమల లడ్డు వివాదానికి సంబంధించి ఎందుకు మాట్లాడలేదని కూడా ప్రశ్నించారు. అలా సొంత పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసిన పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబుతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈరోజు మళ్లీ సీఎం చంద్రబాబు తో పాటు బిజెపి నేతలతో కూడా సంయుక్త సమావేశం నిర్వహిస్తున్నారు పవన్. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసుకుంటూ భారీ వ్యూహం సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతోంది.నెయ్యి వివాదానికి సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం చేపట్టిన విచారణ, దానికి సంబంధించి ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేసింది. అయితే 36 మంది నిందితులుగా చూపింది. అందులో కల్తీ నెయ్యి సరఫరా చేసిన డైరీ యజమానులు, టిటిడి మాజీ ఉద్యోగుల పాత్ర బయటపడింది. నెయ్యి బదులు పామాయిల్ మిశ్రమాన్ని, కెమికల్స్ ను వాడి కోట్లాదిమంది భక్తుల నమ్మకాన్ని తాకట్టు పెట్టిన వారిని అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం బలమైన సందేశాన్ని పంపాలని నిర్ణయించింది. కేవలం అరెస్టులకి పరిమితం కాకుండా.. గత ప్రభుత్వంలోని కీలక నేతల ప్రమేయంపై ఆధారాలను ప్రజల ముందు ఉంచే ఆలోచనలో ఉంది కూటమి.ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేయనుంది కూటమి. ఈ అంశాన్ని కేవలం ఒక కేసుగా మాత్రమే కాకుండా.. హిందూ ధర్మ పరిరక్షణ కోణంలో సామాన్య భక్తుల దగ్గరకు తీసుకెళ్లాలని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఎదురుదాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టడమే కాకుండా.. వారు చేసిన తప్పులను ప్రజల వద్ద చర్చించేలా ప్రచార వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో ప్రజాక్షేత్రంలో భారీ బహిరంగ సభలు లేదా ధర్మరక్షణ యాత్రల ద్వారా ప్రజలకు వాస్తవాలను వివరించే అవకాశం ఉంది. ఈ విషయంపైనే పవన్ కళ్యాణ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో చర్చించారని.. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత పవన్ ఈ విషయంపై సీఎం చంద్రబాబుతో చర్చించారని.. ఈరోజు రాష్ట్ర బిజెపి నేతలతో కలిసి భారీ వ్యూహరచన చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టిగానే టార్గెట్ అవుతుందన్నమాట.

# బీజేపీ వ్యూహాత్మక మౌనమా...

**విజయవాడ, ఫిబ్రవరి 6, పెన్ పవర్:** ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో బిజెపి ఒక భాగస్వామి. కానీ తమ ప్రభుత్వంతో వైసీపీ చెడుగుడు ఆడుకుంటే ఎదుర్కోవడంలో పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం తిరుమల ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున దుమారం రేగింది. ఇంత పెద్ద గొడవ జరిగి కూటమి ప్రభుత్వాన్ని జగన్మోహన్ రెడ్డి టార్గెట్ చేసుకుంటే బిజెపి మొక్కుబడిగా స్పందిస్తోంది. అయితే అది తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రత గురించి అన్న విషయాన్ని గుర్తించుకోవాలి బిజెపి. హిందూ ధర్మ పరిరక్షణ విషయంలో బిజెపి కఠినంగా ఉంది. కానీ తిరుమల తిరుపతి దేవస్థానం ఇష్యూలో వైసిపి ఇంతలా గలాటా చేస్తుంటే బిజెపి ఎందుకు ప్రేక్షక పాత్ర పోషిస్తోంది? అనేది అందరి సందేహం. కోట్లాదిమంది హిందువులు ఆరాధించే తిరుమల స్వామి వారి పట్ల.. వైసీపీ ఎన్నో అపచారాలు చేసింది. ఆ ప్రభుత్వ హయాంలో తప్పిదాలు జరిగాయి. అదే సమయంలో కేంద్రంలో బిజెపి ఉంది. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో కొనసాగడంతో పాటు ఏపీలో కూటమి భాగస్వామిగా ఉంది. అయినా సరే పట్టకుండా వ్యవహరిస్తుండడం చూస్తుంటే ఏదో ఒక అనుమానం కలుగుతోంది.వైసిపి హయాంలో నెయ్యిలో కల్తీ జరిగిందని నిర్ధారణ అయింది. కూటమి ఆరోపిస్తున్నట్లు జంతు కొవ్వు కలిసిందని తేలకపోయినా.. కల్తీ జరిగిందన్న విషయం ప్రత్యేక దర్యాప్తు బృందం తేల్చింది. ఇటువంటి సమయంలో వైసీపీ ప్రజల ముందు తలదించుకొని దోషిగా నిలబడాలి. ఆ పని చేయకపోగా తిరిగి ఎదురు దాడి చేస్తోంది. తమకూటమి ప్రభుత్వంపై వైసీపీ ఎదురు దాడి చేస్తున్నా.. ఏపీ బీజేపీ నేతలు పెద్దగా స్పందించకపోవడం అనేది నిజంగా లోటు. జగన్మోహన్ రెడ్డి అన్యమతస్తుడని ఇదే బిజెపి చాలా సందర్భాల్లో ఆరోపణలు చేసింది. అటువంటి నేత పార్టీ ఇప్పుడు తిరుమల లో ఆటలాడుతుంటే.. ఆ పేరుతో రాజకీయ సంక్షోభం సృష్టిస్తుంటే బిజెపి ప్రేక్షక పాత్ర చాలా బాధాకరం.ఏపీ విషయంలో బిజెపి ఏదో ఒక వ్యూహంతో ఉన్నట్లు అర్థమవుతోంది. రాష్ట్రంలో మత రాజకీయాలు ముదిరితేనే బిజెపికి పట్టు లభిస్తుందనే ఆలోచనతోనా? ఆ వ్యూహంలో భాగంగానే జగన్మోహన్ రెడ్డిని పావుగా వాడుకుంటుందా? అందుకే జగన్ పట్ల మెతక వైఖరి ప్రదర్శిస్తోందా? అయితే బిజెపి మౌనంగా ఉండడం చూసి జగన్మోహన్ రెడ్డి తనకు అండగా ఉందన్న బ్రహ్మలోరిచ్చిపోతున్నారా? అనేది తెలియాల్సి ఉంది. అయితే బిజెపి హై కమాండ్ సూచనతోనే రాష్ట్ర బిజెపి నేతలు వైసిపి విషయంలో ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు అన్నది అనుమానం. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి విషయంలో బిజెపి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది.

# టీ20 ప్రపంచకప్ 2026.. అందరి కళ్లు ఈ 10 మంది ఆటగాళ్లపైనే!

### రేపటి నుంచి టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం
### భారత్, శ్రీలంక సంయుక్తంగా అందిస్తున్న ఆతిథ్యం
### భారత్‌లో బ్యాటింగ్, లంకలో స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లు
### టోర్నీ ఫలితాన్ని శాసించగల 10 మంది కీలక ఆటగాళ్లపై ప్రత్యేక దృష్టి




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026కు రంగం సిద్ధమైంది. రేపటి నుంచి భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో ఈ మెగా టోర్నీ షురూ కానుంది. ఈసారి ప్రపంచకప్ వ్యూహాత్మకంగా ఎంతో భిన్నంగా ఉండనుంది. ఒకవైపు భారత్‌లోని బ్యాటింగ్ స్వర్గధామాలపై పరుగుల వరద పారే అవకాశం ఉండగా, మరోవైపు శ్రీలంకలోని నెమ్మదైన పిచ్‌లు స్పిన్నర్లకు, ఓపికతో ఆడే బ్యాటర్లకు పరీక్ష పెట్టనున్నాయి. ఈ పొట్టి ఫార్మాట్‌లో పవర్‌ప్లేలో చెలరేగడం, మిడిల్ ఓవర్లలో పరుగులను కట్టడి చేయడం, డెత్ ఓవర్లలో ఒత్తిడిని జయించడం వంటి కీలకమైన లక్షణాలే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశిస్తాయి. గతాన్ని చూస్తే, కొద్దిమంది ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనలే టోర్నమెంట్ గమనాన్ని మార్చేశాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రపంచకప్‌లో తమదైన ముద్ర వేయగల 10 మంది ఆటగాళ్లపై ఓ లుక్ వేద్దాం.

**భారత ఆటగాళ్లు:**
టీమిండియా దూకుడుకు నిదర్శనం అభిషేక్ శర్మ. పవర్‌ప్లేను అవకాశంగా మలచుకుని బౌలర్లపై విరుచుకుపడతాడు.
ఇక, బిగ్ టోర్నీ స్పెషలిస్ట్ హార్దిక్ పాండ్యా ఒత్తిడిలో రాణించగల సామర్థ్యంతో జట్టుకు సంపూర్ణ సమతుల్యం అందిస్తాడు.
ఒకప్పుడు మిస్టరీ స్పిన్నర్‌గా పేరు తెచ్చుకున్న వరుణ్ చక్రవర్తి, ఇప్పుడు నియంత్రణ, వ్యూహంతో పవర్‌ప్లేలోనే వికెట్లు తీయగలడు.
బ్యాటర్ల ఆధిపత్యం నడిచే ఈ ఫార్మాట్‌లోనూ తన యార్కర్లు, వైవిధ్యమైన బంతులతో మ్యాచ్‌ను శాసించగల బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా.

**అంతర్జాతీయ స్టార్లు:**
ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ తన దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి వ్యూహాలను చిన్నాభిన్నం చేయగలడు.
శ్రీలంక పిచ్‌లపై ఆ జట్టు స్పిన్ సంచలనం వనిందు హసరంగ అత్యంత ప్రమాదకారి. కీలక సమయాల్లో వికెట్లు తీయడమే కాకుండా, బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగలడు.
దక్షిణాఫ్రికాకు క్వింటన్ డి కాక్ తన సొగసైన ఆటతో పవర్‌ప్లేలో ఆధిపత్యం చెలాయిస్తాడు.
ఇంగ్లండ్ దూకుడుకు ప్రతిరూపం ఫిల్ సాల్ట్.
ఆఫ్ఘనిస్థాన్ జట్టుకు రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెన్నెముక కాగా, ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్, పేస్ బౌలింగ్‌తో జట్టుకు కీలకం కానున్నాడు.
మొత్తం మీద ఈ ప్రపంచకప్ శక్తికి, యుక్తికి మధ్య జరిగే పోరుగా నిలవనుంది. మార్చి 8 వరకు జరిగే ఈ టోర్నీలో ఏ జట్టు విజేతగా నిలుస్తుందో తెలియాలంటే, ఈ కీలక ఆటగాళ్ల ప్రదర్శనపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఒక్క ఓవర్ ఆటను మార్చే ఈ ఫార్మాట్‌లో వీరి ప్రదర్శన కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ బద్దలుకొట్టిన రికార్డ్స్ ఇవే..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్, ఇండియా మధ్య జరుగుతున్న అండర్ 19 వరల్డ్ కప్ మ్యాచ్ యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చెలరేగాడు. 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్సులతో 175 రన్స్ బాదాడు ఈ చిచ్చరపిడుగు. క్రీస్ లో అడుగు పెట్టినప్పటి నుంచి బ్యాట్ తో విజృంభించాడు సూర్యవంశీ. సూర్యవంశీ స్పీడ్ కి ఇంగ్లాండ్ బౌలర్లు ఏమాత్రం బ్రేకులు వేయలేకపోయారు.
కేవలం 55 బంతుల్లోనే సెంచరీ చేసిన సూర్యవంశీ.. అతితక్కువ బంతుల్లో సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా రికార్డ్ సాధించాడు. అండర్ 19 వరల్డ్ కప్ లో సెంచరీ చేసిన మూడో ఇండియన్ ప్లేయర్ గా నిలిచాడు సూర్యవంశీ. గతంలో మంజోత్ కాల్రా, ఉన్ముక్త్ చంద్ ఈ ఘనత సాధించగా.. వారికంటే తక్కువ బంతుల్లో సెంచరీ సాధించిన ప్లేయర్ గా రికార్డ్ సాధించాడు సూర్యవంశీ.

**సూర్యవంశీ బద్దలుకొట్టిన రికార్డులు ఇవే:**
అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్స్ లో అత్యధిక స్కోర్ ( 175 )
అండర్ 19 వన్డే చరిత్రలో 100 సిక్సర్లు పూర్తి చేసిన ఫస్ట్ ప్లేయర్
అత్యంత చిన్న వయసులో అండర్ 19 వరల్డ్ కప్ లో సెంచరీ
అండర్ 19 వరల్డ్ కప్ లో అత్యంత వేగవంతమైన సెంచరీ
ఫైనల్ మ్యాచ్ లో అత్యధిక సిక్సులు
అండర్ 19 వరల్డ్ కప్ ఒకే సీజన్లో అత్యధిక సిక్సర్లు.

# అనుకున్నదే జరిగింది.. ఇంగ్లండ్ ఓపెనర్ మళ్లీ ఫెయిల్.. అంబ్రీష్ బౌలింగ్‌లో బౌల్డ్




**హైదరాబాద్ పెన్ పవర్:** అనుకున్నదే జరిగింది. 412 పరుగుల భారీ టార్గెట్ ఛేజింగ్‌లో ఇంగ్లండ్ ఆదిలోనే తడబడింది. తొలి రెండు ఓవర్లు టీమిండియా బౌలర్లు ఒక్క పరుగు రానివ్వకుండా కట్టడి చేశారు. ఆ తర్వాత.. ఇంగ్లండ్ ఓపెనర్ జోసెఫ్ మూర్స్ నాలుగు ఫోర్లతో చెలరేగి స్పీడ్ పెంచినప్పటికీ ఆ జోరు కాసేపటికే ఆవిరైపోయింది. టీమిండియా బౌలర్ ఆర్ఎఎస్ అంబ్రీష్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కావడంతో ఇంగ్లండ్ ఓపెనర్ మూర్స్ 16 బంతుల్లో 17 పరుగులు చేసి నిరాశగా వెనుదిరిగాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ దగ్గర నుంచి మూర్స్ ఫామ్ కోల్పోయాడు. బంగ్లాతో ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలిచినప్పటికీ మూర్స్ ఆరు బంతుల్లో ఒక్క పరుగు చేసి పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వాత న్యూజిలాండ్ మ్యాచ్‌లో 40 బంతుల్లో 20 పరుగులు, ఆస్ట్రేలియా మ్యాచ్‌లో 33 బంతుల్లో 25 పరుగులు, కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో 16 బంతుల్లో 17 పరుగులు. ఇలా ఈ ఇంగ్లండ్ ఓపెనర్ ఫామ్ కోల్పోవడం.. టీమిండియా 412 పరుగుల టార్గెట్ పెట్టడంతో ఇంగ్లండ్ బ్యాటర్లపై తీవ్రంగా ఒత్తిడి ఉంది.
ఇక.. మరో ఓపెనర్ బెన్ డాకిన్స్ కూడా చేతులెత్తేస్తే ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌లో గెలవడం దాదాపు కష్టమే. ఎనిమిది ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లండ్ జట్టు ఒక వికెట్ నష్టానికి 41 పరుగులు చేసింది. బెన్ డాకిన్స్ 21 బంతుల్లో 25 పరుగులు, బెన్ మేయెస్ ఏడు బంతుల్లో రెండు పరుగులు చేసి క్రీజులో ఉన్నారు.

# యష్ 'టాక్సిక్'.. తెలుగు టార్గెట్ రీచ్ అవుతుందా?



దివి రెడ్ చీరలో అందరి దృష్టిని ఆకర్షించింది



సిమ్రాన్ చౌదరి నేచురల్ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది



స్టార్ హీరో యష్.. ఇప్పుడు టాక్సిక్ మూవీతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ ట్యాగ్ లైన్ తో రూపొందుతున్న ఆ చిత్రానికి గీతూ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. సమ్మర్ కానుకగా మార్చి 19వ తేదీన సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుండగా.. ఇప్పటికే ఆ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు మేకర్స్. వరుస ప్రమోషనల్ కంటెంట్ ను రిలీజ్ చేసేందుకు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా.. వాటిని మరింత పెంచేలా ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే పాన్ ఇండియా వైడ్ గా సినిమా రిలీజ్ కానుండగా.. తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ కోసం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన థియేట్రికల్ హక్కులను పీవీఆర్- ఐనాక్స్ సొంతం చేసుకుంది. ఇప్పటికే ఆ విషయాన్ని అనౌన్స్ చేసింది. అయితే సుమారు రూ.40 కోట్ల అడ్వాన్స్ కు తెలుగు స్టేట్స్ రైట్స్ ను పీవీఆర్- ఐనాక్స్ దక్కించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో యష్ కెరీర్ లోనే కాకుండా తెలుగులో కన్నడ హీరోలకు సంబంధించిన సినిమాల్లో టాక్సిక్ టాప్ డీల్ అని తెలుస్తోంది. కేజీఎఫ్ సిరీస్ చిత్రాల విజయాల తర్వాత యష్ మార్కెట్ రేంజ్ పెరిగిన విషయం తెలిసిందే.

ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కేజీఎఫ్ 2 బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టి నిర్మాతలకు లాభాల వర్షం కురిపించింది. రూ.79 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలో దిగిన ఆ మూవీ.. కంప్లీట్ రన్ లో రూ.140 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇప్పుడు అదే నమ్మకంతోనే టాక్సిక్ పై పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టినట్లు అర్థమవుతుంది. అయితే దానికి తగ్గట్లే సినిమా వసూళ్లు సాధించాలి. టాక్సిక్ బ్రేక్ ఈవెన్ కావాలంటే కనీసం కేజీఎఫ్ ఛాప్టర్ 2 ఫైనల్ కలెక్షన్లలో సగం వసూలు చేయాల్సి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేసినట్లు తెలుస్తోంది. అంటే రూ.70 కోట్లకుపైగా వసూలు చేయాలన్నమాట. అదే జరగాలి అంటే.. సినిమాకు మంచి పాజిటివ్ టాక్ రావాలి.. కంటెంట్ అదిరిపోయేలా ఉండాలి. అప్పుడు ఆ నెంబర్ ను సొంతం చేసుకునే ఛాన్స్ ఉంటుంది. అదే సమయంలో బడా సినిమాల థియేట్రికల్ హక్కులను కార్పొరేట్ సంస్థలు సొంతం చేసుకోవడం ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో ఒక ట్రెండ్ గా మారింది. అలా టాక్సిక్ మూవీని పీవీఆర్- ఐనాక్స్ డిస్ట్రిబ్యూట్ చేయడం వల్ల రిలీజ్ మరింత గ్రాండ్ గా ఉండేలా కనిపిస్తుంది. స్క్రీన్ కౌంట్ కూడా భారీగా పెరిగే ఛాన్స్ ఉంది. దీంతో ఇప్పుడు టాక్సిక్ మూవీ.. తెలుగులో ఎలాంటి హిట్ అవుతుందో.. ఎంతటి వసూళ్లు సాధిస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.
ఇక సినిమా విషయానికొస్తే.. భారీ బడ్జెట్ తో స్టైలిష్ యాక్షన్ డ్రామాగా కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వెంకట్ కె నారాయణ, యష్ సంయుక్తంగా గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మూవీలో యష్‌తో పాటు అందాల భామలు కియారా అద్వానీ, హుమా ఖురేషీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్ నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965